శుక్రవారం 05.06.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 44 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

డీఎస్సీ పరీక్షలు, నియామకాలపై వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు కేవలం రాజకీయ ఉనికి కోసమే. 2025 ఆగస్టులోనే అత్యంత పారదర్శకంగా పూర్తయిన ఉపాధ్యాయ నియామకాలపై, దాదాపు తొమ్మిది నెలల తర్వాత ఇప్పుడు కళ్లు తెరిచి అక్రమాలు జరిగాయంటూ లబోదిబోమనడం ఆ వైసీపీ పార్టీ దివాళాకోరుతనానికి నిదర్శనం.



**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**

# భారత్ - రష్యా స్నేహం ... ఏపీ అభివృద్ధికి వేదిక



- భారత్ - రష్యాల నడుమ అనిర్వచనీయమైన అనుబంధం
- భారత అభివృద్ధి యాత్రలో కీలకదశల వద్ద తోడుగా రష్యా
- 2030 నాటికి $100 బిలియన్ల ద్వైపాక్షిక వాణిజ్యం ఇరుదేశాల లక్ష్యం
- అంతరిక్షంలో మన సుదీర్ఘ అనుబంధం కొత్త శిఖరాలను చేరుతోంది
- ఏపీని $2.5 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా నిలపడమే మా ధ్యేయం
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను మేం సీరియస్ గా పరిగణిస్తాం
- పెట్టుబడిదారులుగా కాకుండా భాగస్వాములుగా మా రాష్ట్రానికి రండి
- ఎస్ పీఐఈఎఫ్ బిజినెస్ ఫోరం సదస్సులో మంత్రి లోకేష్ ప్రసంగం



సెయింట్ పీటర్స్ బర్గ్ (రష్యా): భారత్ - రష్యా నడుమ ఒక అనిర్వచనీయమైన అనుబంధం ఉంది. ప్రపంచంలో ఇది చిరస్థాయిగా నిలబడిన స్నేహం. ఇది వ్యాపార ఒప్పందాలు, దౌత్య నిఘంటువులను మించినది. ప్రపంచం అనిశ్చితిలో ఉన్నప్పుడు కూడా ధృడంగా నిలబడిన బంధమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సెయింట్ పీటర్స్ బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనమిక్ ఫోరం వేదికగా జరిగిన రష్యా-ఇండియా బిజినెస్ ఫోరం సదస్సులో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ ప్రసంగించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... భారతదేశ అభివృద్ధి యాత్రలో కీలక దశల వద్ద రష్యా భారత్ కు తోడుగా నిలిచింది. భిలాయ్ స్టీల్ ప్లాంట్, కూడంకుళం అణువిద్యుత్ కేంద్రం, గగన్యాన్, బ్రహ్మోస్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో రష్యా భారతదేశానికి అండగా నిలచింది. ఈ పునాది రాత్రికి రాత్రి నిర్మించడం సాధ్యమయ్యేదికాదు. దానిని కాపాడుకుంటూ మరింత బలంగా ఇరుదేశాలు ముందుకు సాగాలి.

నేను ఈ ఫోరమ్‌లో మీ ముందుకొచ్చి మాట్లాడుతున్నందుకు గొప్ప గౌరవం ఉంది. నేను ఇక్కడకు రావడానికి కారకులైన భారత ప్రజలు, ప్రధాని నరేంద్ర మోడీజీకి ధన్యవాదాలు చెబుతూ వారి తరపున మీకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

మిగతా 2లో...

## క్వాంటమ్ నుంచి రివర్ మెట్రో వరకు

- క్వాంటమ్ వ్యాలీ ఫ్రేమ్ వర్క్ లో భాగస్వామ్యం వహించండి
- సిస్టమా ప్రెసిడెంట్ తాగిర్ సిట్
- దేకోవ్‌తో భేటీలో ఏపీ మంత్రి నారా లోకేష్

2 లో

## ఏపీకి ఉక్కు పెట్టుబడుల లక్ష్యం

- ఈఏఎఫ్ స్టీల్‌ప్లాంట్‌ను ఏపీలో నిర్మించండి
- శ్రీసిటీలో స్టీల్ ప్రాజెక్టులకు బాటలు
- నోవోస్టల్ - ఎం చైర్మన్ ఇవాన్ డెమ్చెంకోతో భేటీలో ఏపీ మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తి

2 లో

## స్మార్ట్ ట్రాఫిక్.. స్మార్ట్ ట్రాన్స్‌పోర్ట్

- మాస్కో తరహా స్మార్ట్ ట్రాఫిక్‌కు అడుగులు
- మెట్రో అభివృద్ధికి రష్యా సహకారం
- మెట్రో, ట్రాఫిక్ రంగాల్లో మాస్కోతో భాగస్వామ్యం

2 లో



## సైకిల్ పై సీఎం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. జూన్ 5న ఆయన విశాఖ పర్యటనలో పాల్గొనే కార్యక్రమానికి సైకిల్‌పై ప్రయాణించనున్నారు. సహజ వనరుల పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, పచ్చదనం పెంపు లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఉద్యోగులు కూడా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సైకిళ్లు, ఈ-సైకిళ్లపై ప్రయాణించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఒక



మిగతా 2లో...

## అభివృద్ధికి కేబినెట్ ముద్ర



- రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు.. పలు రంగాలకు ఊతం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. సమావేశ నిర్ణయాలను సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు.

వ్యవసాయ రంగంలో చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు మండలంలోని వ్యవసాయ శాఖకు చెందిన 46.69 ఎకరాల భూమిని పీఎం-కుసుమ్ పథకం కింద సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ఎన్ఆర్ఈడీసీఏపీకి 30 ఏళ్ల లీజుకు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

అమరావతి క్వాంటమ్ వ్యాలీ అభివృద్ధికి కేటాయించిన 49.66 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్‌పై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు తదితర చార్జీల మినహాయింపునకు అనుమతి ఇచ్చింది. దీని ద్వారా సుమారు రూ. 5.53 కోట్ల భారం తగ్గనుంది.

రాష్ట్రంలో అవయవ దానాలు, మార్పిడి ప్రక్రియలను నియంత్రించేందుకు ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ యాక్ట్-2011 అమలుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించి ఆర్డినెన్స్ జారీ చేయనున్నారు.

పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా బీచ్ షాక్స్ ఏర్పాటుకు ముసాయిదా ఎక్సైజ్ పాలసీకి ఆమోదం లభించింది. తొలిదశలో చీరాల, విశాఖపట్నంలో పైలట్ ప్రాజెక్టుగా వీటిని ప్రారంభించనున్నారు.

పోలవరం ఎడమ ప్రధాన కాలువ ప్యాకేజీ-5, 5ఏ పనులకు రూ. 796.66 కోట్ల సవరించిన పరిపాలనా అనుమతులు, బాపట్ల జిల్లాలో కుందేరు డ్రెయిన్ పనులకు రూ. 5.17 కోట్ల నిధుల

మిగతా 2లో...

## కిడ్నీ బాధితులకు కొత్త జీవం

కిడ్నీ బాధితులకు కూటమి సర్కార్ తీపి కబురు





- స్వాప్ కిడ్నీ మార్పిడికి గ్రీన్ సిగ్నల్
- కిడ్నీ మార్పిడిలో సరికొత్త అధ్యాయం
- వేలాది కిడ్నీ రోగులకు ఊరట

2 లో..

మంత్రి సత్యకుమార్ ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం

### పిల్లల భవిష్యత్తుకు 'నవచేతన' పునాది

తొలి 1,000 రోజులు స్వర్ణావకాశం: మంత్రి సంధ్యారాణి!

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రతి చిన్నారికి జీవితంలో అత్యుత్తమ ఆరంభాన్ని అందించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బాల్యారంభ అభివృద్ధి మరియు అభివృద్ధి స్క్రీనింగ్‌పై రాష్ట్రవ్యాప్త సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి మంత్రివర్యులు గుమ్మిడి సంధ్యారాణి గారు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ, గర్భధారణ నుండి రెండేళ్ల వయస్సు వరకు ఉండే తొలి 1,000 రోజులు చిన్నారి జీవితంలో అత్యంత కీలకమైన కాలమని పేర్కొన్నారు. ఈ సమయంలో పిల్లల మెదడు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని, ప్రతి సెకనుకు దాదాపు 10 లక్షల న్యూరల్ కనెక్షన్లు ఏర్పడతాయని తెలిపారు. పిల్లల మెదడు అభివృద్ధిలో 80 శాతం మూడు సంవత్సరాల వయస్సులోపు, 90 శాతం ఆరు సంవత్సరాల వయస్సులోపు పూర్తవుతుందని వివరించారు.

ప్రారంభ సంవత్సరాల్లో అందే పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, స్పందనాత్మక సంరక్షణ, ప్రారంభ అభ్యసన అవకాశాలు, భద్రత మరియు ప్రేరణ పిల్లల భవిష్యత్తు విద్య, ఆరోగ్యం, ఉత్పాదకత మరియు శ్రేయస్సుపై గణనీయమైన ప్రభావం చూపుతాయని మంత్రి పేర్కొన్నారు.

బాలల అభివృద్ధిలో ఆలస్యాలను ముందుగానే గుర్తించి సకాలంలో జోక్యాలు చేపట్టేందుకు స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ, వైద్య మరియు ఆరోగ్య శాఖతో సమన్వయంగా "నవచేతన" అనే మొబైల్ ఆధారిత అభివృద్ధి స్క్రీనింగ్ సాధనాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

## ఏపీ టూరిజానికి గ్లోబల్ కిరీటం!



- బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్'గా ఆంధ్రప్రదేశ్ ఎంపిక
- గ్లోబల్ ట్రావెల్ మార్కెట్-2026లో అవార్డు అందుకున్న మంత్రి దుర్గేష్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం అంతర్జాతీయ స్థాయిలో సరికొత్త చరిత్ర సృష్టించింది. రాష్ట్రంలోని అపారమైన పర్యాటక వనరులను, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పడంలో కూటమి ప్రభుత్వం చూపిన అసాధారణ ప్రతిభకు గానూ దక్షిణాదిలోనే అతిపెద్ద ట్రావెల్ అండ్ ట్రేడ్ ఎక్స్‌పో అయిన 'గ్లోబల్ ట్రావెల్ మార్కెట్-2026'ఆంధ్రప్రదేశ్‌ను "బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్"గా ఎంపిక చేసింది. కేరళలోని కోవాలం 'లీలా తిరువనంతపురం రావిజ్ హోటల్'లో జరిగిన ప్రతిష్టాత్మక బిజినెస్-టు-బిజినెస్, బిజినెస్-టు-కన్స్యూమర్ పర్యాటక వేదికపై, దేశవిదేశాల ప్రముఖుల సమక్షంలో కేరళం పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి పి.సి. విశ్వనాథ్, ఎమ్మెల్యే మురళీధరన్, త్రివేంద్రం మేయర్ వి.వి.రాజేష్ ల చేతుల మీదుగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈ అవార్డును సంతోషంగా స్వీకరించారు. ఉత్తమ పర్యాటక ప్రచార రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మిగతా 3లో...

## రాజ్యసభ సీట్ల పంపకం ఖరారు



- టీడీపీకి మూడు.. జనసేనకు ఒక స్థానం
- త్వరలో అభ్యర్థుల ప్రకటన

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సీఎం క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగిన ఎన్డీఏ మిత్ర పక్షాల సమావేశం సుదీర్ఘంగా జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల రెండేళ్ల పాలన, రాజ్యసభ సీట్ల కేటాయింపు అంశంపై ఎన్డీఏ పక్ష నేతలు చర్చించారు. అనేక సవాళ్లను ఎదుర్కొని ప్రభుత్వం సాధించిన విజయాలను గ్రామగ్రామాన ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని అభిప్రాయపడ్డారు. మూడు ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనపై ఎన్డీఏ తరపున చేపట్టే ప్రచార కార్యక్రమాలపై చర్చించారు. 9వ తేదీన తిరుపతి, 12వ తేదీన అమరావతి, 15వ తేదీన విశాఖలో బహిరంగ సభలు నిర్వహించాలని సీఎం చంద్రబాబు సూచించారు. తిరుపతిలో సంక్షేమం, అమరావతిలో సుపరిపాలన, విశాఖలో అభివృద్ధి అంశాలపై కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు.

మిగతా 2లో...

## గోదావరి తీరాన మహా వైభవం



- సమగ్ర బ్లూప్రింట్ సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి ఆనం ఆదేశం
- ఆరు జిల్లాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రానున్న గోదావరి పుష్కరాలను దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచే విధంగా, మహా కుంభమేళా తరహాలో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. నేడు రాష్ట్ర సచివాలయంలో దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ విభాగ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

పుష్కరాల నిర్వహణకు సంబంధించి సమగ్ర బ్లూప్రింట్‌ను అత్యవసరంగా సిద్ధం చేసి ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాల కోసం చేపట్టాల్సిన అన్ని అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

గోదావరి నది పరివాహక ప్రాంతంలోని ఆరు జిల్లాల్లోని పుష్కర ఘాట్ల

-3లో...

## గంగపుత్రుల కల సాకారం



- తీరంలో సంబరం..మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో కలలకు సాకారం
- బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బరుకు మహర్దశ
- నిధులు విడుదల పరిపాలన సంబంధం అయిన ఆమోదం
- ఎన్నికల హామీ నెరవేర్చిన కూటమి ప్రభుత్వం
- నవ్యాంధ్ర నిర్మాణంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అద్వితీయ సహకారం
- జిల్లాలో 17 635 మత్స్యకార కుటుంబాలకు ఉపాధి పరంగా భరోసా

3 లో

## ఆసుపత్రుల ఆవరణలో మొక్కలు నాటాలి



- పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు జరపాలి
- వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని రకాల ఆసుపత్రుల్లో మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, వ్యర్థాల నిర్వహణ, నీటి సంరక్షణ, ఇంధన పొదుపు, ఆరోగ్య సంస్థల్లో సుస్థిర విధానాల అమలుపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆసుపత్రులు, కళాశాలల ఆవరణలో మొక్కల్ని నాటడంతో పాటు అవగాహన సదస్సులు, ఉపన్యాసాలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపుపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు కూడా చేపట్టాలన్నారు. సిబ్బంది, విద్యార్థులు, రోగులు, వారి సహాయకులు, సందర్శకులకు వీలైనంత మేర మొక్కలను పంపిణీ చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించే పోస్టర్లు, బ్యానర్లు, ఐఈసీ ప్రచార సామగ్రిని ప్రదర్శించాలని సూచించారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర్ బాబు, వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ విష్ణువర్ధన్ గురువారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు.

సెకండరీ హెల్త్ శాఖలోని ప్రతి ఉద్యోగీ తమ కార్యాలయాలు, ఆసుపత్రుల ఆవరణలో కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని చక్రధర్ బాబు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సెకండరీ హెల్త్ ఆసుపత్రులు, కార్యాలయాల్లో జూన్ 5న కనీసం 12,500 మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అధికారులు, సిబ్బంది అందరూ భాగస్వాములు కావాలని కోరారు. మొక్కల మనుగడ శాతం పెరిగేలా అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ఆరోగ్యవంతమైన మొక్కల్ని ఎంపిక చేసుకోవాలన్నారు. మొక్కలు నాటే ముందు తగిన పరిమాణంలో గుంతలు తవ్వి, స్థానిక సేంద్రియ ఎరువులతో నింపాలని సూచించారు. అలాగే ప్రభుత్వ వైద్య కళాశాలలు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులు, బోధనాసుపత్రులు, ప్రత్యేక వైద్యాసుపత్రులు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు, పాఠశాలల్లో పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని డిఎంఈ డాక్టర్ విష్ణు వర్ధన్ ఆదేశాలు పంపారు. డాక్టర్లు, సిబ్బంది అందరినీ భాగస్వామ్యం చేయాలని ఆయన సూచించారు.

## అమరావతిలో అటల్ బిహారీ వాజపేయి విగ్రహం వద్ద బీజేపీ నేతల పరిశీలన



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయనున్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి భవ్య విగ్రహం ప్రాంతాన్ని బీజేపీ నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా అటల్ జీ చూపించిన మార్గంలోనే సుశక్తి, సుసంపన్న భారత నిర్మాణం దిశగా తమ ప్రయాణం కొనసాగుతుందని నేతలు పేర్కొన్నారు.

అనంతరం ఇదే ప్రాంతంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయం నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కూడా నేతలు పరిశీలించారు. రాజధాని ప్రాంతంలో పార్టీ కార్యకలాపాల విస్తరణకు అనుగుణంగా కార్యాలయ ఏర్పాట్లపై చర్చించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, అస్సాం రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి రవీంద్ర రాజు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, నాగోతు రమేష్ నాయుడు, మట్టా ప్రసాద్, సాలిగ్రామ లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీల విద్యాభివృద్ధికి కృషి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** మైనారిటీల విద్యాభివృద్ధి కోసం రాష్ట్రప్రభుత్వం కార్యాచరణ బద్ధంగా కృషి చేస్తున్నదని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. రాష్ట్రస్థాయిలో పదవ తరగతి, ఇంటర్ విద్యలో అత్యుత్తమ మార్కులు సాధించిన మైనారిటీ విద్యార్థులను గురువారం మంత్రి సన్మానించి ఆశీర్వదించారు. వెలగపూడి సచివాలయం మూడవ బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్లో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ విద్య తోనే తాము అనుకున్న ఉన్నత స్థాయికి యువత ఎదిగి దేశ నిర్మాణ ప్రక్రియలో పాలుపంచుకోగలరని అన్నారు. మైనారిటీ కుటుంబాల్లో విద్యార్థుల శ్రేయోభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా అన్ని రకాలుగా ప్రోత్సాహం అందిస్తున్నదని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇటీవలనే వక్ఫ్ బోర్డు ద్వారా తాలిం ఏ హునర్ పథకం క్రింద కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత రెసిడెన్షియల్ ఇంటర్ విద్య కోసం నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లో ప్రతిభగలిగిన 250 మందిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. మైనారిటీ కుటుంబాలలోని ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం ఉచిత డీఎస్సీ శిక్షణ, పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో మైనారిటీల సంక్షేమ శాఖ ఇంచార్జ్ సెక్రటరీ సూర్య కుమారి, మైనారిటీ కార్పొరేషన్ ఎండి యకూబ్ భాష, క్రిస్టియన్ కార్పొరేషన్ ఎండి శేఖర్, డిడి సరోజినీ, అధికారులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గంగపుత్రుల కల సాకారం



**నిమ్మాడ(జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి హామీలలో భాగంగా మంత్రి అచ్చెన్నాయుడు తీసుకున్న చొరవతో బుడగట్లపాలెం హార్బరుకు వైభవం దక్కనుంది. గత ప్రభుత్వం జిల్లా జాలర్లకు మాటలు చెప్పడమే తప్ప పనులు ఏమీ చేయలేకపోయిందని,. తమ సర్కారు వచ్చాక నిర్లక్ష్యాలకు తావే లేకుండా పనులు చేపట్టి అనూహ్య అభివృద్ధి ఫలాలు ఇస్తామని ఎన్నికల వేళ ఆ రోజు కూటమి పెద్ద హోదాలో ఇప్పటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలలో భాగంగా కూటమి ప్రభుత్వం ఇప్పటికే హార్బర్ల ఏర్పాటుకు అలానే పోర్టుల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యం ఇస్తూ వస్తున్నది. ఇందులో భాగంగానే ఇప్పటికే దాదాపు పనుల పూర్తితో మూలపేట పోర్టు ముందుండగా, ఇప్పుడు బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బరు కూడా అదే కోవలోకి చేరనుంది. దీంతో ఎన్నికల హామీలు కేవలం మాటలకే పరిమితం కావని చేతల్లో నిరూపించారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు..అలానే మంత్రి అచ్చెన్నాయుడు

**గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం ఫలితంగా :** బుడగట్లపాలెం హార్బరు పనులేవీ ముందడుగు వేయలేకపోయాయి. దీంతో మత్స్యకారుల కుటుంబాలకు నిరాశే మిగిలింది. కూటమి ప్రభుత్వం పాలన పగ్గాలు అందుకున్నాక సంబంధిత వర్గాలలో ఆశలు నింపుతూ మత్స్యకార శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో..బుడగట్లపాలె ఫిషింగ్ హార్బరు పనులకు సంబంధించి నిధులు వచ్చాయి. కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు 444. 75 కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ పరిపాలన పరం అయిన అనుమతులను మంత్రి అచ్చెన్న తీసుకుని వచ్చి విజయవంతం అయ్యారు. దీంతో ఎన్నికల నాటి హామీలను నెరవేర్చిన ఘనత మంత్రి అచ్చెన్నకే దక్కిందన్న ఆనందం ఇక్కడి మత్స్యకార కుటుంబాలలో వెల్లువెత్తుతోంది. పనులు పూర్తయితే సముద్ర అలల ఉధృతిని తట్టుకునేలా బ్రేక్‌వాటర్లు, పడవలు సురక్షితంగా నిలిపేందుకు జెట్టీలు, మత్స్యకారులకు చెందిన పడవలను నిలుపుకునే కేంద్రాలతో పాటు అత్యాధునిక మౌలిక సదుపాయాలు దక్కనున్నాయి. దీనివల్ల చేపల వేట, నిల్వ, రవాణా సౌకర్యాలు మెరుగుపడి మత్స్యకారులకు ఆర్థికంగా భారీ ప్రయోజనం చేకూరనుంది.

ముఖ్యంగా ఇక్కడ ఉపాధి లేని కారణంగా అనేక మత్స్యకార కుటుంబాలు వలసలు వెళ్తున్నాయి. వీటిని నివారిస్తూ.. వారికో జీవనోపాధి ఇచ్చేవిధంగా బ్లూ ఎకానమీ (మత్స్య సంబంధిత ఆధారిత వ్యాపారం, సంబంధిత సంపద) పెంచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అలానే తీర ప్రాంత పరిరక్షణ, తీర ప్రాంత కోతల నివారణ, మత్స్యకార ప్రాంతాల అభివృద్ధి అన్నవి ప్రాధాన్యంగా ఎంచుకుని కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పనిచేస్తూ ఉన్నాయి. ముఖ్యంగా నిధుల విడుదలకు సంబంధించి మంత్రి అచ్చెన్న తీసుకున్న చొరవ ఎంతో గొప్పది అని ఇక్కడి మత్స్యకార సంఘాలు ఆనందం వ్యక్తం చేస్తూ ఉన్నాయి.

**17,635 మత్స్యకార కుటుంబాలకు వరం..వలసలకు బ్రేక్ :** జిల్లాలో దాదాపు 17,635 సాగర మత్స్యకార కుటుంబాలు ఇవాళ వేటపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వేలాది కుటుంబాల జీవితాల్లో కొత్త వెలుగులు నింపనుంది. బుడగట్లపాలెం హార్బర్ అందుబాటులోకి వస్తే స్థానికంగానే ఉపాధి లభించి, జిల్లాను సుదీర్ఘకాలంగా వేధిస్తున్న వలసల నివారణ సులభతరం కానుంది. గంగపుత్రుల జీవనోపాధికి గట్టి ఊతం లభించడంతో పాటు వారి జీవన ప్రమాణాలు పెరగనున్నాయి. ఈ నేపథ్యంలో మత్స్యకార వర్గాలు కూటమి ప్రభుత్వంపై, మంత్రి అచ్చెన్నాయుడిపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నాయి.

# గోదావరి తీరాన మహా వైభవం

(మొదటి పేజీ తరువాయి)



నిర్మాణాపు పనులు, మరమ్మతులు, విస్తరణ, పరిశుభ్రత, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, భక్తుల వసతి, రవాణా తదితర అంశాలపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. త్వరలోనే ఆయా జిల్లాల కలెక్టర్లు, స్థానిక శాసనసభ్యులు, సంబంధిత అధికారులతో కలిసి పుష్కర ఘాట్లను స్వయంగా పరిశీలించనున్నట్లు తెలిపారు.

ఆరు జిల్లాల దేవాదాయ శాఖ అధికారులు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని ఆలయాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో స్థానిక శాఖల అధికారులతో ప్రత్యేక సమన్వయ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు.

పుష్కరాల సందర్భంగా భక్తులకు సాంప్రదాయ, ఆధ్యాత్మిక సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు పిండప్రదాన కార్యక్రమాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆనం సూచించారు. ఇందుకు అవసరమైన వేద పండితులు, అర్చకులు, బ్రాహ్మణుల సంఖ్యపై అంచనాలు రూపొందించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

అలాగే శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఆరు జిల్లాల్లోని ఆలయాల నిర్మాణం, అభివృద్ధికి సంబంధించి స్థానిక శాసనసభ్యుల నుంచి ప్రతిపాదనలు స్వీకరించి వాటిని ప్రాధాన్యత ఆధారంగా అమలు చేయాలని సూచించారు.

గోదావరి నది రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్న మంత్రి, తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి మరియు అధికారులతో త్వరలో సమావేశమై పరస్పర సహకారంతో ఉభయ రాష్ట్రాల్లో గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

పుష్కరాల నిర్వహణలో పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య, రోడ్లు-భవనాలు, విద్యుత్, పర్యాటక తదితర శాఖల మధ్య సమర్థవంతమైన సమన్వయం ఉండాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు.

కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ మహత్తర ఆధ్యాత్మిక వేడుకలను విజయవంతం చేయడానికి ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రతి నెలా గోదావరి పుష్కరాల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. చేపడుతున్న పనుల పురోగతిపై అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

గోదావరి పుష్కరాలు రాష్ట్ర ప్రతిష్ఠకు అద్దం పట్టే మహత్తర ఆధ్యాత్మిక ఉత్సవంగా నిలిచేలా ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపడుతోందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.

ఈ సమీక్ష సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి హరిజవహర్ లాల్, దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, రాష్ట్ర దేవాలయ పరిపాలన సంస్థ ( శిక్షణ సంస్థ ) ముక్తేశ్వరరావు, అదనపు కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, దేవదాయ చీఫ్ ఇంజనీర్ శేఖర్, దేవాదాయ శాఖ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ టూరిజానికి గ్లోబల్ కిరీటం!

(మొదటి పేజీ తరువాయి)

రెండో రోజు కేరళం పర్యటనలో భాగంగా అవార్డు స్వీకరించిన అనంతరం మంత్రి కందుల దుర్గేష్ భావోద్వేగంతో మాట్లాడుతూ... "తిరువనంతపురం వేదికగా ఈ అరుదైన పురస్కారాన్ని అందుకోవడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఈ గుర్తింపును అందించిన నిర్వాహకులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ అవార్డును నేను ఒక వ్యక్తిగత గౌరవంగా కాకుండా.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దిశానిర్దేశంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, మా పర్యాటక భాగస్వాములు మరియు ఏపీ ప్రజలు అందరూ కలిసి చేసిన సంయుక్త కృషికి దక్కిన గౌరవంగా భావించి స్వీకరిస్తున్నాను.

సీఎం చంద్రబాబునాయుడు పర్యాటక రంగానికి 'పారిశ్రామిక హోదా' కల్పించడంతో పాటు, నూతన పర్యాటక పాలసీ 2024-29 ద్వారా ఇన్వెస్టర్లకు క్యాపిటల్ సబ్సిడీలు, 100% ఎస్జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ ఇస్తూ 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు పెద్దపీట వేశారు. పీపీపీ విధానంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ 7 యాంకర్ పర్యాటక హబ్‌లతో పాటు 25కు పైగా థీమాటిక్ సర్క్యూట్లను అభివృద్ధి చేస్తున్నాం. 'వికసిత్ భారత్ – 2047' లక్ష్యంగా 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచంలోనే అత్యుత్తమ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే మా సంకల్పం..భారతదేశ పర్యాటక వృద్ధి కథనంలో ఆంధ్రప్రదేశ్ ఒక బలమైన శక్తిగా ఎదుగుతోందనే నమ్మకాన్ని ఈ సత్కారం మరింత బలోపేతం చేసింది" అన్నారు. పర్యాటకం అనేది కేవలం ప్రయాణం మాత్రమే కాదని.. అది సమాజంలోని కళాకారుల నుండి వ్యాపారవేత్తల వరకు ప్రతి ఒక్కరికీ ఉపాధిని, జీవనోపాధిని కల్పించే ఒక ఆర్థిక వృద్ధి ఇంజిన్ అని మంత్రి దుర్గేష్ అభివర్ణించారు.

అంతకుముందు, 'గ్లోబల్ ట్రావెల్ మార్కెట్ 2026' ఎగ్జిబిషన్‌ను మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ పర్యాటక స్టాల్‌ను ప్రారంభించి, పర్యాటక విశేషాల బ్రోచర్లను స్వయంగా పంపిణీ చేశారు. ఇంటర్నేషనల్ టూర్ ఆపరేటర్లతో ముఖాముఖి చర్చించి, భారతదేశంలోని వివిధ రాష్ట్రాల పర్యాటకులను ఆంధ్రప్రదేశ్ వైపు ఆకర్షించడం కోసం నిర్వహిస్తున్న 'హాలిడే ఇన్ ఏపీ' క్యాంపెయిన్‌ను గురించి వివరించారు. ఈ సందర్భంగా ఏపీ పర్యాటక వృద్ధిని చూసి ప్రభావితమైన నిర్వాహకులు వచ్చే ఏడాది (సెప్టెంబర్ 27, 2027) వరల్డ్ టూరిజం డే సందర్భంగా '+వీ 2027' ఎక్స్ పోను ఆంధ్రప్రదేశ్‌లోనే నిర్వహిస్తామని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా గ్లోబల్ ట్రావెల్ మార్కెట్ ప్రారంభోత్సవంలో ప్రసంగించిన మంత్రి దుర్గేష్..ఏపీలో వెల్ నెస్, క్రూయిజ్ టూరిజం లో ఇన్వెస్ట్ చేయండి.. ఇదే బెస్ట్ టైమ్ అని పిలుపునిచ్చారు. తద్వారా ఇన్వెస్టర్లు బెనిఫిట్ అవుతారని చెప్పారు. బీచ్, టెంపుల్స్, రివర్, బ్యాక్ వాటర్స్, వైల్డ్ లైఫ్, ఎకో, అడ్వెంచర్, క్రూజ్, కల్నరీ, కల్చర్, వెల్‌నెస్ , హెరిటేజ్, బుద్ధిస్ట్ టూరిజం.. ఇలా ఒక్కటేమిటి భారతదేశంలోని ప్రతి అద్భుత దృశ్యం ఏపీలోనే ఉందని, 'సరికొత్త ఆలోచనలతో రండి.. పెట్టుబడులు పెట్టండి.. మీకు అండగా మేముంటాం' అని జీటీఎం వేదికగా టూర్ ఆపరేటర్లు, ఇన్వెస్టర్లను మంత్రి దుర్గేష్ ఆహ్వానించారు.

**ఏపీ ఒక సంపూర్ణ పర్యాటక ప్యాకేజీ:మంత్రి కందుల దుర్గేష్:** ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన, అత్యధికులు దర్శించే ఆధ్యాత్మిక క్షేత్రం 'తిరుమల'తో పాటు 80 వేలకు పైగా దేవాలయాలకు నిలయం ఏపీ అని, 13 వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు (వైల్డ్ లైఫ్ శాంచ్యురీలు), 3 జాతీయ పార్కులు, దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వ్ (నాగార్జునసాగర్-శ్రీశైలం) మరియు భారతదేశంలోనే రెండవ అతిపెద్ద మడ అడవుల (మ్యాంగ్రోవ్స్) తీరప్రాంతం తమ సొంతమన్నారు. చారిత్రక లేపాక్షి వీరభద్రస్వామి ఆలయం, తిరుమల కొండలు మరియు విశాఖలోని అరుదైన ఎర్రమట్టి దిబ్బలకు యునెస్కో తాత్కాలిక ప్రపంచ వారసత్వ కట్టడాల జాబితాలో స్థానం సంపాదించాయన్నారు. స్వదేశీ పర్యాటకుల సందర్శనలో దేశంలోనే 4వ స్థానంలో ఉన్నామని, 1,054 కిలోమీటర్లతో భారతదేశంలోనే 3వ అతిపెద్ద తీరప్రాంతం, పర్యాటకానికి అనువైన 283 అద్భుతమైన బీచ్‌లు ఏపీ సొంతమని మంత్రి కందుల దుర్గేష్ వివరించారు. కడప జిల్లాలోని గండికోట 'ఇండియాన్ గ్రాండ్ కాన్యన్'గా ప్రపంచ ప్రసిద్ధి చెందిందని, అద్భుతమైన పడవ ప్రయాణాలకు, ప్రకృతి అందాలకు నిలయమైన బ్యాక్‌వాటర్ వనరులలో దేశంలోనే 2వ స్థానంలో ఏపీ ఉందని గణాంకాలతో సహా వివరించారు.

300కు పైగా ఎగ్జిబిటర్లు, 1,000 మందికి పైగా బయ్యర్లు ఒకే చోట చేరిన జీటీఎం 2026 సదస్సు కేవలం ఒక ప్రదర్శన మాత్రమే కాదని, ఇది సరికొత్త ఆవిష్కరణలకు, ఆర్థిక వృద్ధికి మరియు పరస్పర అనుసంధానానికి ఒక ప్రధాన చోదక శక్తి గా మంత్రి దుర్గేష్ అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నేడు పర్యాటక రంగంలో కళ్లు చెదిరే మార్పులకు సాక్ష్యంగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు.. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రికార్డు స్థాయిలో 36.42 కోట్ల పర్యాటక సందర్శనలను నమోదు చేసి సుస్థిర వృద్ధిని సాధించిందని, దేశీయ పర్యాటకంలో ఏపీ ఇప్పటికే దేశంలోనే అగ్రగామిగా కొనసాగుతుండగా.. అంతర్జాతీయ పర్యాటకుల రాకలో ఏకంగా 48% పైగా స్పష్టమైన వృద్ధి నమోదైందని వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్ అనేది కేవలం సందర్శించే స్థలం కాదు.. అదొక అద్భుతమైన అనుభూతి. ఇక్కడ ప్రతి ప్రయాణం ఒక కథను చెబుతుంది, ఇక్కడికి వచ్చే ప్రతి పర్యాటకుడు ఆ కథలో ఒక భాగమవుతాడు అనే స్ఫూర్తిదాయకమైన మాటలతో మంత్రి దుర్గేష్ తన ప్రసంగాన్ని ముగించారు.

**ఏపీ టూరిజాన్ని నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లిన ఘనత మంత్రి కందుల దుర్గేష్ ది:ప్రతినిధులు :** ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే మంత్రి కందుల దుర్గేష్'బ్రాండ్ ఏపీ' పేరుతో సోషల్ మీడియా, అంతర్జాతీయ ప్లాట్‌ఫామ్స్‌పై డిజిటల్ బ్రాండింగ్ సరికొత్తగా డిజైన్ చేశారని ప్రతినిధులు కొనియాడారు. విశాఖ, విజయవాడ, తిరుపతి, ఢిల్లీలలో రీజినల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్స్.. చెన్నై, కోల్‌కతా,ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ లలో రోడ్ షోలు నిర్వహించడంతో పాటు బెర్లిన్, లండన్ వంటి అంతర్జాతీయ వేదికలపై ఏపీ పర్యాటక వాణిని బలంగా వినిపించారని అవి తమను ఆకర్షించాయన్నారు. కేవలం టెంపుల్ టూరిజానికే పరిమితం కాకుండా ఎకో, అడ్వెంచర్, హెరిటేజ్, బీచ్, క్రూయిజ్, రివర్, కల్చర్, మెడికల్ టూరిజంలను ప్రోత్సహించారని పేర్కొన్నారు.

సీప్లేన్ సర్క్యూట్లు, వాటర్ స్పోర్ట్స్, కారవాన్ టూరిజం, లగ్జరీ టెంట్ సిటీలు, హోమ్ స్టేలను అందుబాటులోకి తెచ్చి ఏపీ టూరిజాన్ని నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లిన ఘనత మంత్రి దుర్గేష్ కు దక్కుతుందన్నారు. పర్యాటక ప్రమోషన్‌లో భాగంగా స్థానిక కళలు, వంటకాలు, హస్తకళలకు ప్రాధాన్యత ఇస్తూ గ్రామీణ పర్యాటకాన్ని బలోపేతం చేయడం ద్వారా స్థానిక జనసమూహాల ఆర్థికాభివృద్ధికి కృషి చేయడం, ఏడాదంత పర్యాటక శోభ ఉండేలా పర్యాటక ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆయన పనితీరుకు నిదర్శనమని కొనియాడారు..ముఖ్యంగా సీఎం విజన్‌ను, డిప్యూటీ సీఎం ఆలోచనలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో మంత్రి కందుల దుర్గేష్ విజయవంతం అయ్యారని వారు తెలిపారు. ఈ క్రమంలో కేవలం 24 నెలల కాలంలోనే ఒబెరాయ్, తాజ్, ఎట్మోస్ఫియర్ కోర్, రాడిసన్ బ్లూ, నోవాటెల్, మేఫేర్, ఫెమా, జీఆర్టీ, ఐటీసీ, సరోవర్, దస్పల్లా, ఫార్చ్యూన్, మారియట్, వివంత, హిల్టన్, లెమన్ ట్రీ. హయత్, కల్ట్ మహీంద్ర తదితర ప్రఖ్యాత 117 సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకుని, రాష్ట్రానికి దాదాపు రూ. 20,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, దాదాపు 8 పర్యాటక ప్రాజెక్టులకు గానూ రూ. 430 కోట్ల కేంద్ర నిధులను సాధించడమేగాక పర్యాటక రంగాన్ని ఆర్థిక వృద్ధికి, ఉపాధి కల్పనకు ప్రధాన ఇంజిన్‌గా మార్చడం, పలు పర్యాటక ప్రాంతాలకు ప్రాచుర్యం కల్పించడం వంటి అంశాలు పురస్కారం వచ్చేందుకు కారణమయ్యాయని నిర్వాహకులు తెలిపారు. అతి తక్కువ కాలంలోనే లభించిన ఈ అంతర్జాతీయ గుర్తింపు రాష్ట్ర పర్యాటక రంగానికి ఒక 'స్వర్ణయుగం'గా నిలుస్తుంది.

## అహంకార, విధ్వంసక పాలనకు ప్రజలు స్వస్తి పలికి రెండేళ్లు



- బెదిరింపులు, అవినీతితో సాగిన నాటి వైకాపా పాలన
- కూటమి ప్రభుత్వం పాలనలో రాష్ట్రంలో అనూహ్య అభివృద్ధి
- వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** 'ఆంధ్రప్రదేశ్ ప్రజలు గత రెండేళ్ల కిందట ఇదేరోజు చరిత్ర సృష్టించారు. ఆనాటి వైకాపా పాలన అహంకారానికి, అరాచకానికి, అవినీతికి, విధ్వంసపాలనకు ప్రజలు జూన్ 4, 2024న స్వస్తి పలికి కూటమి పాలనకు జై కొట్టారు . ఒక్క ఛాన్స్ పేరుతో వచ్చిన నాటి జగన్ ప్రభుత్వం రాష్ట్ర భవిష్యత్తుతో ఆటలాడుకుంది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్రాన్ని కాపాడేందుకు ప్రజలు ఎన్డీఏ కూటమికి చారిత్రాత్మక విజయాన్ని అందించారు' అని భాజపా జాతీయ నాయకుడు, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. 'ప్రజలను, వ్యవస్థలను బెదిరించి సైకో పాలన కొనసాగించిన విధ్వంస పార్టీకి ఆనాటి ఎన్నికల్లో ప్రజలు ఛీకొట్టారు. సైకో పాలన పోవాలి –రాష్ట్రం బాగుండాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పు మేరకు కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పాలన సాగిస్తోంది. రాజధాని అమరావతిలో అభివృద్ధి కార్యకలాపాలు పరిగెడుతున్నాయి రాష్ట్రానికి పెట్టుబడులు తరలివస్తున్నాయి. గత వైకాపా పాలనలో వ్యవస్థలపై కోల్పోయిన నమ్మకం ప్రజల్లో రోజురోజుకీ పెరుగుతోంది. ప్రజలు అప్పగించిన పవిత్ర విజయంతో కూటమి ప్రభుత్వం హెల్దీ, వెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ధ్యేయంగా పాలన సాగిస్తోంది' అని మంత్రి సత్యకుమార్ నేడొక ప్రకటనలో పేర్కొన్నారు.

## గిరిజన సంక్షేమ కార్యక్రమాల అమలుపై ఎస్టీ కమిషన్ ఛైర్మన్ ఉన్నత స్థాయి సమీక్ష




**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో పర్యటించి, గిరిజన సంక్షేమ కార్యక్రమాల అమలు, రాజ్యాంగ పరమైన రక్షణలు, ఉద్యోగుల సమస్యలపై ఉన్నత స్థాయి సమీక్షలు నిర్వహించామని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ ఛైర్మన్ అంతర్ సింగ్ ఆర్య మరియు సభ్యుల బృందం తెలిపారు. గిరిజనుల హక్కులను పరిరక్షించడం, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం ఈ పర్యటనల ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు.

స్థానిక వివంతా (గేట్ వే) హోటల్ లో గురువారం ఏర్పాటు చేసిన పాత్రికేయల సమావేశంలో జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ ఛైర్మన్ అంతర్ సింగ్ ఆర్య, కమిషన్ సభ్యులు జటోతు హుస్సేన్, నిరుపమ్ చక్మా, కమిషన్ కార్యదర్శి ప్రశాంత్ కుమార్ సింగ్, డైరెక్టర్ డా. పి. కళ్యాణ్ రెడ్డి లతో మాట్లాడుతూ... రాష్ట్రంలో షెడ్యూల్డ్ తెగల సంక్షేమ కార్యక్రమాల అమలుతీరు, గిరిజన ప్రాంతాల్లోని వాస్తవ పరిస్థితులను సమీక్షించేందుకు నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ (ఎన్‌సీఎస్‌టీ) బృందం రాష్ట్రంలో పర్యటించామన్నారు. రాష్ట్ర స్థాయి సమీక్షకు ముందు రెండు నుంచి మూడు రోజుల పాటు గిరిజన ప్రాంతాల్లో పర్యటించి, ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు, సమస్యలు, సూచనలు సేకరించడం కమిషన్ ఆనవాయితీ అని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రజా ప్రతినిధులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలతో సమావేశాలు నిర్వహించినట్టు తెలిపారు.

గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ అనీమియా సమస్య తీవ్రతపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ఈ వ్యాధి నిర్మూలన కోసం దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా కళాశాలల్లో విద్యార్థులతో 'యువ సంవాద్' కార్యక్రమాలు నిర్వహిస్తూ, యువతలో ఆరోగ్య చైతన్యం, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

నేటి సోషల్ మీడియా యుగంలో యువత సరైన దిశగా పయనించాల్సిన అవసరం ఉందని, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నిర్వహించే 'మన్ కీ బాత్', 'పరీక్షా పే చర్చ' కార్యక్రమాలు యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని తెలిపారు.

పెసా చట్టం పరిధిలోని గిరిజన ప్రజలతో ప్రత్యేకంగా 'జన సంవాద్' కార్యక్రమం నిర్వహించి, వారి అభిప్రాయాలు, సమస్యలు, సూచనలను కమిషన్ సేకరిస్తోందని చెప్పారు. గిరిజన స్వపరిపాలనకు ఉద్దేశించిన పెసా చట్టం పూర్తిస్థాయిలో అమలయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. గిరిజన ప్రాంతాల పర్యటనల్లో సేకరించిన ఫీడ్‌బ్యాక్‌ను సమగ్ర నివేదిక రూపంలో సిద్ధం చేసి, రాష్ట్ర ముఖ్యమంత్రికి అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే గౌరవ గవర్నర్ దృష్టికి కూడా కీలక అంశాలను తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన జరగబోయే రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశంలో గిరిజనుల సమస్యలు, సంక్షేమ కార్యక్రమాల అమలు, పెసా చట్టం అమలు స్థితి, సికిల్ సెల్ అనీమియా నివారణ చర్యలపై సమగ్ర చర్చ జరపనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పథకాలు, కమిషన్ కార్యక్రమాలు ప్రజల్లోకి చేరాలంటే మీడియా కీలక పాత్ర పోషిస్తుందని కమిషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. పాత్రికేయుల సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎమ్. ఎమ్ నాయక్, డైరెక్టర్ ఎస్. భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

## అన్యాక్రాంతం అవుతున్న కుమ్మరి కుంటను కాపాడాలి

-ఎమ్మార్వోకు కుమ్మరి సంఘం తరపున వినతి పత్రం అందజేత



**చౌటుప్పల్ డివిజన్, జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** సంఘం గ్రామంలోని పురాతన కుమ్మరి కుంట అన్యాక్రాంతానికి గురవుతున్న నేపథ్యంలో వెంటనే చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరుతూ కుమ్మరి సంఘం నాయకులు వలిగొండ ఎమ్మార్వో గారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమ్మరి సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ, కుమ్మరి కుంట గ్రామంలోని కుమ్మరి వృత్తిదారుల జీవనాధారానికి, సంప్రదాయ వృత్తి పరిరక్షణకు ఎంతో కీలకమని తెలిపారు. కొంతమంది వ్యక్తులు కుంట పరిధిని ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారని, దీనివల్ల ప్రభుత్వ భూములు క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కుమ్మరి కుంటకు సంబంధించిన పూర్తి సర్వే నిర్వహించి, ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలని, భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణలు జరగకుండా శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంగమ్ అధ్యక్షులు తడూరి వేంకటేష్, ప్రధానకార్యదర్శి పూసుకూరి లింగస్వామి, కోశాధికారి పూసుకూరి యాదయ్య,కుమ్మరి సంఘం రాష్ట్ర, మండల నాయకులు, గ్రామ పెద్దలు, కుమ్మరి వృత్తిదారులు మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు

## తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే సహించం



**-పవన్ కళ్యాణ్ బహిరంగంగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి**

**-చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు తాడూరు పరమేష్**

**-మాజీ అధ్యక్షులు ఊడుగు శ్రీనివాస్ గౌడ్**

**చౌటుప్పల్ డివిజన్, జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టే విధంగా, "మీ అయ్యా జాగీరా" అంటూ మాట్లాడిన జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వెంటనే తెలంగాణ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు తాడూరి పరమేష్, మాజీ అధ్యక్షులు ఉడుగు శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం కోట్లాది మంది ప్రజల త్యాగాలు, ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా సాధించుకున్న స్వప్నమని పేర్కొన్నారు. అలాంటి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా, ప్రజల మనోభావాలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని అన్నారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు సంయమనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని, ప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడటం సమంజసం కాదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల గౌరవాన్ని కించపరిచే ఏ వ్యాఖ్యనైనా తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. పవన్ కళ్యాణ్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను భవిష్యత్తులో పునరావృతం చేయవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పిట్టల బిక్షమయ్య ,జాయింట్ సెక్రెటరీ మక్తాల నరసింహ గౌడ్, స్పోర్ట్స్ అండ్ కల్చర్ సెక్రటరీ దేశ బోయిన శ్రీశైలం యాదవ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ ఎండి కయుంపాషా, మాజీ లైబ్రరీ కార్యదర్శి శేఖర్, న్యాయవాదులు బడుగు శ్రీకాంత్, చామట్ల జంగయ్య , గర్దాసు రాఘవేందర్, కట్టెల లింగస్వామి, సిలువేరు మల్లికార్జున్ న్యాయవాదులు పాల్గొన్నారు

# ఘనంగా మాజీ మంత్రి హరీశ్ రావ్ జన్మదిన వేడుకలు



**చౌటుప్పల్ డివిజన్, జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** భారత రాష్ట్ర సమితి చౌటుప్పల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు గారి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. చౌటుప్పల్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షులు బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి హరీష్ రావు గారు అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజాసేవలో మరింత రాణించాలని, తెలంగాణ రాష్ట్రానికి మరింత పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కార్యకర్తలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు మల్లేష్ గౌడ్, బార్ కౌన్సిల్ అధ్యక్షులు తాడూరు పరమేష్, సతీష్, తూర్పునూర్ మల్లేష్ గౌడ్, కానుగు శివ, బండ్ల శ్రీకాంత్, అమీర్, మున్నా, సంగిశెట్టి శివ, అత్తు ఈశ్వర్, విజయ్, గంగాదేవి రమేష్, గంగాదేవి శివ, చీమకండ్ల కృష్ణయ్య, నరేంద్ర, సాగర్, రమణ, గోవి రఘు, పిల్లలమర్రి సాయి, గుండెబోయిన వెంకటేశం, కోయిలగూడెం వెంకటేశం, ముసిర్ ఒమర్, కళ్లెట్ల నాగరాజు, రెడ్డగోని మల్లేశం, ఊదని రాకేష్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**రామ్ మందిర్ ఏరియా జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించి వారి సమస్యలను పరిష్కరించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన నగరంలోని 26, 27, 28 డివిజన్లలో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీల్లోని రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, విద్యుత్, పారిశుద్ధ్యం తదితర సమస్యలపై స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వెంటనే పరిష్కార మార్గాలు చూపేందుకు ఇటువంటి పర్యటనలు నిరంతరం కొనసాగిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించిన ఆయన, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, ఇంచార్జ్ కమిషనర్ అరుణ శ్రీ, కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు

## మంచితనానికి మారుపేరు గోపు ఐలయ్య యాదవ్-రామగుండం శోకసంద్రం



**రామ్ మందిర్ ఏరియా జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** చెడు గుండెల్లోనూ మంచి ముద్ర వేసుకున్న వ్యక్తి, ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచిన అపన్నహస్తుడు, సామాజిక సేవలో తనదైన ముద్ర వేసిన ప్రముఖ కాంట్రాక్టర్ గోపు ఐలయ్య యాదవ్ ఇకలేరనే వార్త రామగుండం ప్రాంత ప్రజలను తీవ్ర విషాదంలోకి నెట్టింది. గౌతమీనగర్‌కు చెందిన గోపు ఐలయ్య యాదవ్ వ్యాపార నిమిత్తం కలకత్తా నగరం వెళ్లగా గుండెపోటుతో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే రాజకీయ, సామాజిక, వ్యాపార వర్గాలకు చెందిన పలువురు నాయకులు, అభిమానులు, మిత్రులు ఆయన నివాసానికి చేరుకుని నివాళులర్పించారు. సాదాసీదా స్వభావం, అందరినీ ఆప్యాయంగా పలకరించే మనస్తత్వం, అవసరమైన వారికి చేయూతనందించే గుణం ఆయనను ప్రజల మనిషిగా నిలబెట్టాయి. మొరుమూర్ గ్రామంలో జన్మించిన ఐలయ్య యాదవ్, కాంట్రాక్టర్‌గా ఎదిగినా సామాజిక బాధ్యతను ఎప్పుడూ మరువలేదు. ముఖ్యంగా మొరుమూర్ కొమురన్న జాతర నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తూ భక్తుల ఆదరణ పొందారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు అనేక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఆయన మృతితో రామగుండం ప్రాంతం ఒక మంచి మనిషిని, సమాజ సేవకుడిని కోల్పోయిందని పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, మిత్రులు ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. గోపు ఐలయ్య యాదవ్ మరణం యాదవ సంఘానికి, రామగుండం ప్రాంత ప్రజలకు తీరని లోటని పలువురు పేర్కొన్నారు

## విత్తన దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు



**తాండూర్, (జర్నలిస్ట్ ఫైల్) :** తాండూర్ మండలం ఐబీ కేంద్రంలోని విత్తనాల దుకాణాలపై జిల్లా వ్యవసాయ అధికారిని సురేఖ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విత్తనాల నాణ్యత, స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, ధరల పట్టిక, లైసెన్సులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టడం, రైతులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులు ప్రభుత్వ లైసెన్స్ కలిగిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేసి, పక్కా బిల్లు తీసుకోవాలని సూచించారు. అనుమతి లేని, నాణ్యత లేని విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో బెల్లంపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు రాజు నరేందర్, మండల వ్యవసాయ అధికారి సుష్మా, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు

## రైల్వే భూమిలోని కట్టడాల కూల్చివేత





**-భారీ బందోబస్తు మధ్య భూమి స్వాధీనం**

**-హద్దులు, కట్టడాల తొలగింపు**

**తాండూర్, (జర్నలిస్ట్ ఫైల్) :** మండలంలోని రేచిని రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో గల వివాదాస్పద భూమిని బుధవారం రైల్వే అధికారులు భారీ బందోబస్తు మధ్య స్వాధీనం చేసుకున్నారు. తెల్లవారుజామున బెల్లంపల్లి రైల్వే ఇంజనీరింగ్ అధికారులు జేసీబీలు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, సివిల్ పోలీసులతో కలిసి పెద్ద ఎత్తున రైల్వే సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. రైల్వే శాఖకు, ఓ ప్రైవేటు సంస్థకు మధ్య వివాదంలో ఉన్న భూమి చుట్టూ ఉన్న హద్దులను, అందులోని కట్టడాలను తొలగించారు. నేషనల్ హైవేను ఆనుకొని నిర్మాణంలో ఉన్న ఓ కట్టడాన్ని సైతం కూల్చివేశారు. పెద్ద ఎత్తున రైల్వే అధికారులు, పోలీసులు, రైల్వే సిబ్బంది ఈ కూల్చివేతల్లో పాల్గొనడంతో మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దీన్ని చూసేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. సుమారు నాలుగు గంటల పాటు రైల్వే అధికారులు తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ఘటనపై బెల్లంపల్లి రైల్వే శాఖకు చెందిన ఓ ఇంజనీరింగ్ అధికారిని వివరణ కోరగా, రైల్వే ఆస్తులను కాపాడుకోవడం నిత్య చర్యల్లో భాగం. గతంలో ఈ భూమిపై కోర్టు స్టే ఆర్డర్ ఉండగా, ప్రస్తుతం అది తొలగిపోయింది. కోర్టు ఆదేశాల మేరకే ఈ భూమిని రైల్వే శాఖ స్వాధీనం చేసుకుంది. ఇందులో ప్రత్యేక విషయం ఏమీ లేదు అని పేర్కొన్నారు. ఈ తొలగింపుల్లో బెల్లంపల్లి రైల్వే ఇంజనీరింగ్ శాఖ అధికారులతో పాటు తాండూర్ సీఐ దేవయ్య, తాండూర్, తాళ్ల గురజాల ఎస్సైలు ప్రసాదరావు, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు

## ప్రత్యేక విస్తృత ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ముందస్తుగా మ్యాపింగ్ కనీసం 85% పూర్తి చేయాలి..

### - ఆర్డిఓ ఎస్ రమణారెడ్డి



**మిర్యాలగూడ, జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రత్యేక విస్తృత ఓటర్ల జాబితా సవరణ(ఎస్ఐఆర్) ముందస్తుగా మ్యాపింగ్ కనీసం 85 శాతం పూర్తి చేయాలని మిర్యాలగూడ ఆర్డిఓ ఎస్.రమణారెడ్డి కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన బూత్ లెవెల్ సూపెర్వైజర్స్, బూత్ లెవెల్ ఆఫీసర్స్ సమావేశంలో ఆయన మిర్యాలగూడ రెవిన్యూ డివిజన్ లో మ్యాపింగ్ సంతృప్తికరంగా జరిగిందని మిర్యాలగూడ పట్టణంలో ఓటర్లు 93,207 మంది ఉండగా 56,384మంది మ్యాపింగ్ జరిగిందని, మండలంలో 55,672 ఓటర్లకు గాను 44,530 మంది ఓటర్ల మ్యాపింగ్ జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ఈ నెల 15నుండి ప్రారంభం కానున్నదని అప్పటిలోగా కనీసం 85 శాతం చేయాలని ఆయన కోరారు. ఓటర్ జాబితాలో 2002 నాటి జాబితా మ్యాపింగ్ కై ఉదయం సాయంత్రం చల్లటి వేళ ఇంటింటికి తిరిగి చేయాలని ఆయన కోరారు. పూర్తి నిబద్ధత, అంకితభావంతో పని చేయాలని ఆయన కోరారు. సమావేశంలో తహసీల్దార్ పి.శ్రీనివాస్, మునిసిపల్ కమీషనర్ శ్రీజారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రింగు ప్రవీణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ కల్పన పాల్గొన్నారు.

## ప్రజారోగ్యమే ధ్యేయం..అభివృద్ధి పనుల్లో నాణ్యత ముఖ్యం

### - ఎమ్మెల్యే బిఎల్ఆర్



**మిర్యాలగూడ, జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** మిర్యాలగూడ పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (బి ఎల్ ఆర్) అన్నారు. బుధవారం పబ్లిక్ హెల్త్ విభాగం ఉన్నతాధికారులతో కలిసి ఆయన పట్టణంలో శరవేగంగా జరుగుతున్న చిన్న చెరువు కట్ట ఆధునీకరణ పనులను మరియు మురుగునీటి శుద్ధి కేంద్రం ( ఎస్ టి పి ప్లాంట్ ను ) నిర్మాణ ప్రగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే బిఎల్ఆర్ అధికారులతో కలిసి ప్రతి పనిని నిశితంగా పరిశీలించి, పలు కీలక సూచనలు చేశారు. చిన్న చెరువు కట్ట నిర్మాణ పనులను పరిశీలించి, వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని కట్టను మరింత బలంగా నిర్మించాలని ఆదేశించారు. కట్టపై ప్రజల కోసం వాకింగ్ ట్రాక్, లైటింగ్, మరియు పచ్చదనం పెంపొందించే పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. నిరుపయోగంగా ఉన్న ఎస్టీపీ ప్లాంట్ సామర్థ్యం, మురుగునీటి శుద్ధి ప్రక్రియ సాంకేతికతను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకూడదని కాంట్రాక్టర్లను, అధికారులను హెచ్చరించారు.. ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లకుండా పబ్లిక్ హెల్త్ అధికారులు నిరంతరం పనులను పర్యవేక్షించాలని సూచించారు.
నిర్దేశిత కాలపరిమితిలోగా పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ అధికారులు, వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి గారు, డీసీసీ జనరల్ సెక్రెటరీ చిలుకూరి బాలకృష్ణ , కౌన్సిలర్ శ్రీజ , మేడ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బంటు లక్ష్మీ నారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వేములకొండ గ్రామ ప్రజలకు శుభవార్త




**వలిగొండ, జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** వేములకొండ గ్రామ ప్రజలకు ఎన్నో రోజుల కోరిక నెరవేరింది వేములకొండ నుండి రామన్నపేట వరకు కొత్త బస్సు బుధవారం రోజు నఘనంగా ప్రారంభమైంది ఈ బస్సు సౌకర్యం ప్రారంభం కావడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ డిపో మేనేజర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఇకపై విద్యార్థులు ఉద్యోగులు వ్యాపారులు మరియు గ్రామ ప్రజలకు రాకపోకలు మరింత సులభంగా మారనున్నాయి ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సర్పంచ్.ఏర్పుల వెంకటేశం. ఉప సర్పంచ్.అంబటి సాయికుమార్. (లక్ష్మాపురం) (నూతన సర్పంచ్) మరియు (మాజీ సర్పంచ్) వార్డ్ మెంబర్స్.ఇంజమూరి శ్రీను. బత్తుల సువర్ణ..మాదుగుల స్వర్ణలత..ఏర్పుల యాదగిరి. మరియు గ్రామ పెద్దలు.పులిపల్పుల రాములు..ఎస్కే రసూల్.. గణబోయిన నరసింహ. ఆకుల మల్లేశం. కేసిరెడ్డి జనార్దన్ రెడ్డి. గుండు నరసింహ.. అంబటి మోహన్. ఇంజబూరి అంజనేయులు. యువత మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు బస్సు ప్రారంభోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించి అందరూ హర్షం వ్యక్తం చేశారు గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న అధికారులకు వేములకొండ గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు.

## ప్రతి గ్రామంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహించాలి



**మిర్యాలగూడ జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** ఈ నెల 5న ప్రతి గ్రామంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహించాలని మిర్యాలగూడ డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామాలలో పర్యావరణముపై ప్రజలకు అవగాహనా కల్పించాలని ఆయా గ్రామపంచాయతీ సర్పంచులు, కార్యదర్శులను ఆదేశించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 4, 6, 8న పారిశుధ్యంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తుందని ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట ఎంపిడిఓ ఎం. శేషగిరిశర్మ, ఎంపిఓ మాతంగి రమేష్ ఉన్నారు.

## మాజీ మంత్రి గోడిశెల రాజేశం గౌడ్‌ను పరామర్శించిన ప్రముఖ వైద్యులు



**హైదరాబాద్, జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ మంత్రి, తెలంగాణ రాష్ట్ర తొలి ఫైనాన్స్ కమిషన్ మాజీ చైర్మన్ గోడిశెల రాజేశం గౌడ్‌కు ఇటీవల మోకాలి మార్పిడి శస్త్రచికిత్స జరిగిన నేపథ్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ శివరాం, డాక్టర్ హర్ష, డీఎస్ఆర్ సింగ్‌లు హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా పరామర్శించారు. ఈ సందర్భంగా రాజేశం గౌడ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న వైద్యులు, వైద్యుల సూచనలను పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే రాజేశం గౌడ్ త్వరితగతిన ఆరోగ్యవంతులై తిరిగి ప్రజా సేవలో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు మరింత సేవ అందించాలని వారు అభిలషించారు.

# ఉద్యమకారులందరికీ న్యాయం చేస్తాం

**- ఉద్యమకారుల ఎంపిక కమిటీ సభ్యులు మోతె శోభన్ రెడ్డి**





**మిర్యాలగూడ, జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** తొలి దశ,మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొని కీలక పాత్ర పోషించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన ఉద్యమకారులందరికీ న్యాయం చేస్తామని ఉద్యమకారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యులు మోతె శోభన్ రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉద్యమకారుల సన్మాన, కళాకారుల ఆటపాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యమకారులను గుర్తించి న్యాయం చేసే విషయంలో గత ప్రభుత్వ విఫలమైందని ప్రస్తుత ప్రజా ప్రభుత్వం నిజమైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి ప్రభుత్వపరంగా సహాయం చేసేందుకు కమిటీని నియమిచ్చిందని చెప్పారు.తెలంగాణ ఉద్యమకారుల విరోచిత పోరాటంతోనే ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు సాధ్యపడిందని గుర్తు చేశారు. రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణ చేసుకున్న అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉద్యమకారుల త్యాగాలు వెలకట్టలేనిదని వారీ త్యాగఫలమే రాష్ట్ర ఏర్పాటుకు దోహదపడిందని అన్నారు. అందరు ఉద్యమకారులను గుర్తించేందుకు తమ వంతు కృషి చేస్తామని ప్రభుత్వపరంగా ఉద్యమకారులను ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. శాసన మండలి సభ్యులు కేతావత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ ఉద్యమ సమయంలో రాష్ట్ర ఏర్పాటు సరిహద్దు అయిన వాడపల్లి బ్రిడ్జిపై అడ్డు గోడ కట్టి ఆంధ్రుల రాకపోకలను అడ్డుకొని ఉద్యమ తీవ్రతను తెలంగాణ ఏర్పాటు ఆకాంక్షను తెలియజేశామని గుర్తు చేశారు. ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేయడం గొప్ప పరిణామమని అన్నారు. అనంతరం తొలి దశ, మలి దశ తెలంగాణ ఉద్యమం పాల్గొన్న ఉద్యమకారులను మెమొంటో,శాలువ, పూల దండ,ప్రశంస పత్రాలు ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాకారుల ఆటపాట ఆకట్టుకుంది. కార్యక్రమానికి తెలంగాణ జేఏసీ చైర్మన్ మాలి ధర్మపాల్,ఉద్యమకారుల ఫోరం నాయకులు మాలోత్ దశరథ్ నాయక్ లు అధ్యక్షత వహించగా కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు తాళ్లపల్లి రవి,ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మాదుగుల శ్రీనివాస్,సర్పంచ్ బెజ్జం సాయి, బీసీ సంఘం పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు టీజేఎస్ జిల్లా ఉపాధ్యక్షులు క్రాంతి కుమార్, నాయకులు యాదగిరి రెడ్డి, గాయం ఉపేందర్ రెడ్డి,గంధం సైదులు,ధూళిపాల కళావతి, నగేష్,అభినవ్, ఖాజా మొయినుద్దీన్, చిలుక వీరారెడ్డి,షోయబ్ ,బంటు రమేష్, లింగా నాయక్, జయరాజు, కళాకారులు నకిరేకంటి కిరణ్ కుమార్, బచ్చాల కూరి శ్రీనివాస్, దారం మల్లేష్ యాదవ్,సుదర్శన్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ని అడ్డంకులు ఎదురైనా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతాం

**- గత పాలకుల నిర్లక్ష్యం వల్ల నిలిచిపోయిన పాలమూరు రంగారెడ్డి..**



**దేవరకద్ర జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** సీఎం రేవంత్ రెడ్డి జిల్లాలో పెండింగ్ లో ఉన్న అన్ని ప్రాజెక్టులను పూర్తి చేయాలనే కృతనిశ్చయంతో ఉన్నారు.ప్రజా ప్రభుత్వం ప్రజా పాలనలో గౌరవ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు జిల్లాను ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉన్నారు.జి. మధుసూదన్ రెడ్డి దేవరకద్ర శాసన సభ్యులు మాట్లాడుతూ ఒకటిన్నర సంవత్సర కాలంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకుసాగుతుంది. ఇప్పటికే 7 వేల కోట్లకుపైగా ఖర్చు చేసిన ప్రజా ప్రభుత్వం.ఇంకా ఎన్ని నిధులు కేటాయిస్తే ప్రాజెక్టు పూర్తి అవుతుంది అనే అంశంపై ప్రాజెక్టు సందర్శన తరువాత అక్కడే నిర్ణయం తీసుకునే అవకాశం. గత పాలకులు పాలమూరు జిల్లాను నిర్లక్ష్యం చేశారు. వారు పెండింగ్ లో పెట్టిన ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలనే కృతనిశ్చయంతో సీఎం గారు ఉన్నారు.
ముఖ్యంగా పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ కు సంబంధించి ఒక ప్రత్యేకమైన ప్రణాళికతో ముందుకు వెళు_న్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఈ టర్మ్ లో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసితీరుతాం. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలినాటి నుంచే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై సీఎం చాలా సమీక్షలు నిర్వహించారు. ఇరిగేషన్ శాఖ మాత్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా పాలమూరు రంగారెడ్డి పై చాలా సమీక్షా సమావేశాలు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్న. 5 వ తేదీన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లాలో పర్యటించనున్నారు.
కరివేన ప్రాజెక్టును పరిశీలించి అనంతరం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు మంత్రులు మరియు వ్యవసాయ,ఇరిగేషన్ శాఖకు చెందిన ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. రెండున్నరేళ్లలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై ఇప్పటి వరకు చేసిన ఖర్చు,భవిషత్తులో చేయబోయే ఖర్చు వివరాలు ప్రాజెక్టు పూర్తి అవడానికి ఇంకా వెచ్చించాల్సిన మొత్తం ఎంత,ఏవిదంగా ప్రాజెక్టును పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం అనే అంశాలపై చర్చిస్తారు.
అవసరమైన నిర్ణయాలను అక్కడే తీసుకుంటారు అని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం

**- మాజీ హోం మంత్రి మహమూద్ అలీ ప్రసంగం**



**మహబూబ్‌నగర్, జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** హైదరాబాద్ కు సమంతరంగా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మహబూబ్ నగర్ అభివృద్ధి చేసారు.పార్టీ సభ్యత్వ నమోదు.. ఎస్ఐఆర్ పై పార్టీ నాయకులు.. కార్యకర్తలు ఎక్కువ ద్రుష్టి సారించాలి.కెసిఆర్ తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలను పణంగా పెట్టారు.ఫ్రెండ్లీ పోలీస్ తో నేరాలు నియంత్రణ చేసాము.. కాంగ్రెస్ అధికారం లోకి వచ్చాక ఇప్పుడు లాఠీలకు పని చెప్పిన నేరాల నియంత్రణ లేదు.అబద్దపు హామీలతో అధికారంలోకి కాంగ్రెస్ వచ్చింది.మాజీ మంత్రివర్యులు శ్రీనివాస్ గౌడ్ ప్రసంగం కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పట్ల అన్ని వర్గాలు అసంతృప్తి లో ఉన్నాయి.కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం మనం ఒత్తిడి తీసుకురావాలి. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం కు గుర్తు చేయాలి. ముఖ్యమంత్రి వస్తున్నారని వాళ్లకు గుర్తు చేసేందుకు మాత్రమే నిన్న వెయ్యి పడకల అస్పత్రి.. టూరిజం హోటల్ పరిశీలన చేసాము. రాజకీయం కోసం కాదు.జిల్లాను బాగు చేసుకోవాలంటే ఈ ఏడాది మాత్రమే అవకాశం ఉంది.. ఒక ఏడాది ముందు ఎన్నికల హడావిడి ఉంటది..బడ్జెట్ కేటాయింపులు పెద్దగా ఉండవు..ఇప్పుడే హామీల అమలుకు నిధులు ఇచ్చేందుకు ఒత్తిడి తీసుకురావాలి.సభ్యత్వ నమోదు లో అన్ని వర్గాలను భాగస్వామ్యం చేయాలి. రాష్ట్రంలో అత్యధిక సభ్యత్వం నియోజకవర్గంలో చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాన్ని సభ్యత్వ నమోదు సమయంలో ప్రజలకు వివరించాలి.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి.. సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చెప్పాలి.క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్క నాయకుడు.. కార్యకర్తలు పని చేయాలి.2002 తరువాత ఇప్పుడు ఓటర్ లిస్ట్ సవరణ జరుగుతుంది. దీనిని జాగ్రత్తగా చూడాలి. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా చూడాలి.సమావేశం లో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు,ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ లు వాల్యా నాయక్, వెంకటేశ్వర్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, మహబూబ్ నగర్ మండలం అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, హన్వాడ మండలం అధ్యక్షులు కరుణాకర్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు రెహమాన్, ఆంజనేయులు, కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేరాలకు చెక్.. ప్రజల భద్రతకు భరోసా

**- నిఘా కెమెరాల నజర్‌లో బోయిన్‌పల్లి మార్కెట్**
**- సీసీటీవీ కెమెరాలను ప్రారంభించిన ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు**



**సికింద్రాబాద్, జూన్ 4(జర్నలిస్ట్ ఫైల్) :** వేగంగా అభివృద్ధి చెందుతున్న నగర జీవనంలో ప్రజల భద్రతకు సాంకేతికత కీలకమని తిరుమలగిరి డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లోని బోయిన్‌పల్లి అంబేద్కర్ కూరగాయల మార్కెట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ నిఘా కెమెరాలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్కెట్‌లాంటి రద్దీ ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు నేరాల నియంత్రణకు సమర్థవంతమైన సాధనంగా పనిచేస్తాయని తెలిపారు. దొంగతనాలు, గొడవలు, అనుమానాస్పద కదలికలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకునేందుకు ఈ కెమెరాలు దోహదపడతాయని అన్నారు. ప్రజల భద్రతతో పాటు ట్రాఫిక్ నిర్వహణలో కూడా సీసీటీవీ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని ఏసీపీ పేర్కొన్నారు. రద్దీ సమయాల్లో వాహనాల రాకపోకలను పర్యవేక్షించడం, ట్రాఫిక్ సమస్యలను గుర్తించడం, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించడం వంటి అంశాల్లో ఈ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. మార్కెట్ వ్యాపారులు, సందర్శకులకు మరింత భద్రత కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ప్రజా ప్రదేశాల్లో ఇలాంటి నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు దండుగుల రమేష్, దండుగుల నర్సింగ్‌రావు, నరసింహ, మణికంఠ, శ్రీరాజు తదితరులతో పాటు స్థానిక ప్రజలు, వ్యాపారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలకు చెక్

**- రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత: తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు**




**సికింద్రాబాద్, జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** రహదారులపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించినప్పుడే ప్రమాదాలను నివారించగలమని తిరుమల గిరి డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బేగంపేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో రసూల్‌పురాలోని కేఈఐ ఇండస్ట్రీస్‌లో ఉద్యోగులకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని తెలిపారు. అందువల్ల వాహనదారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్‌ను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయడం, అతివేగంగా ప్రయాణించడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించడం వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఇలాంటి ఉల్లంఘనలు చట్టపరమైన చర్యలకు దారితీయడమే కాకుండా ప్రాణాంతక ప్రమాదాలకు కారణమవుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన రహదారి వినియోగదారులుగా వ్యవహరించడంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరులకు కూడా ట్రాఫిక్ భద్రతపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేఈఐ ఇండస్ట్రీస్ మార్కెటింగ్ మేనేజర్ భార్గవ్, జనరల్ మేనేజర్ రవికిరణ్, హెచ్‌ఆర్ ప్రతినిధి షాలిని తదితరులతో పాటు సంస్థ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ట్రాఫిక్ భద్రతకు సంబంధించిన సూచనలను తెలుసుకుని, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ రహదారి భద్రతకు తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# వర్షాకాల సన్నద్ధతపై క్షేత్రస్థాయి పరిశీలన

**- నీటి నిల్వలు, ట్రాఫిక్ అంతరాయాల నివారణకు ముందస్తు చర్యలు**
**- సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్, జీహెచ్ఎంసీ కమిషనర్ సృజన సంయుక్త పర్యటన**

**హైదరాబాద్, జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** జూన్ 3: వర్షాకాలంలో రోడ్లపై వరద నీరు నిల్వ ఉండకుండా, ట్రాఫిక్ అంతరాయాలను నివారించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు సైబరాబాద్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షించారు. ఈ నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, జీహెచ్ఎంసీ కమిషనర్ సృజనతో కలిసి సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పలు సమస్యాత్మక ప్రాంతాలను బుధవారం సందర్శించారు. వర్షాకాలంలో నీటి నిల్వలు ఏర్పడే ప్రాంతాలను పరిశీలించి, సంబంధిత ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలిసి పరిస్థితులను సమీక్షించారు. సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఐటీ కారిడార్ పరిధిలోని మల్కం చెరువు -- బయోడైవర్సిటీ జంక్షన్ సమీపంలోని కేర్ హాస్పిటల్ ప్రాంతాన్ని సందర్శించిన అధికారులు, భారీ వర్షాల సమయంలో రోడ్లపై వరద నీరు చేరుతున్న ప్రాంతాలను పరిశీలించారు. అలాగే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రోడ్, కొండాపూర్‌లోని హర్ష టయోటా షోరూం జంక్షన్ తదితర ప్రాంతాల్లో వర్షాకాలంలో తరచూ నీటి నిల్వలు ఏర్పడుతున్న సమస్యలను గుర్తించారు. ఈ ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన డ్రైనేజీ, వర్షపు నీటి పారుదల వ్యవస్థల అభివృద్ధిపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వ ఉండటం వల్ల ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థ సజావుగా కొనసాగేందుకు మునిసిపల్ అధికారులు, పోలీసులు, ఇంజనీరింగ్ విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టడం ద్వారా వర్షాకాలంలో ప్రజలకు కలిగే ఇబ్బందులను తగ్గించడంతో పాటు ట్రాఫిక్ అంతరాయాలను కూడా నివారించవచ్చని అధికారులు తెలిపారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, కూకట్‌పల్లి డీసీపీ రిత్‌రాజ్, ఏడీసీపీ హనుమంతరావుతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# గ్రేటర్ జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇవ్వండి..

- అక్రెడిటేషన్‌తో సంబంధం లేకుండా ఇవ్వాలి
- ముఖ్యమంత్రికి జీహెచ్ జే సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి..

**హైదరాబాద్, జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** సుప్రీం కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్ట్స్ యాక్ట్ ప్రకారం అన్ని కేటగిరీల్లోని జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జర్నలిస్టులందరికి వెంటనే ఇళ్ళస్థలాలు కేటాయించాలని సమావేశం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా.. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం విచారకరమని పలువురు సీనియర్ జర్నలిస్టులు అన్నారు. బుధవారం హైదరాబాద్ చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలు, సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. గ్రేటర్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి స్థలం లేదా సభ్యులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని సమావేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతూ తీర్మానించింది. అక్రెడిటేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం ఇవ్వాలని, జర్నలిస్టుల్లో వివక్ష చూపొద్దని సమావేశం కోరింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పని చేస్తున్న అన్ని కేటగిరీల జర్నలిస్టులకు 200 చ.గ స్థలాన్ని ఫ్యూచర్ సిటీలో కేటాయించాలని కోరుతూ సమావేశం తీర్మానించింది. సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, సొసైటీలో సభ్యత్వం తీసుకున్న 1350 మంది గ్రేటర్ జర్నలిస్టులు 18 ఏళ్ళుగా ఇంటి జాగల కోసం ఎదురు చూస్తున్నారని, గత ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని, కనీసం ఈ ప్రభుత్వం అయినా ఇళ్ళస్థలాలిచ్చి ఆదుకోవాలని కోరారు. గ్రేటర్ సొసైటీలో ఉన్న దాదాపు 1350 మంది జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం చాలా ఏళ్ళుగా ఎదురుచూస్తున్నారని, ఇప్పటికే ఎంతోమంది జర్నలిస్టులు స్థలం పొందకుండానే చనిపోయారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, పలువురు మంత్రులను కలిసి పలుమార్లు విన్నవించినప్పటికీ స్థలం కేటాయింపునకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా ప్రభుత్వం చేతులెత్తేసిందని, మొన్న జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళస్థలాలపై ఎటువంటి నిర్ణయం లేదని, నిన్న జరుపుకున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో ముఖ్యమంత్రి చేసిన ప్రసంగంలో జర్నలిస్టుల సంక్షేమం, ఇళ్ళస్థలాల మాటే లేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును పక్కన పెట్టి ప్రత్యామ్నాయ జీవోల ద్వారా జర్నలిస్టు సొసైటీలకు స్థలాలు ఇవ్వాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు.



**మద్దతు ప్రకటించిన కోదండరాం :** సొసైటీ సర్వసభ్య సమావేశానికి హాజరుకావాల్సి ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అనివార్యకారణాల వల్ల హాజరుకాలేకపోయారు. దీంతో ఆయన ఫోన్ ద్వారా తన సందేశాన్ని సమావేశానికి వినిపించారు. గ్రేటర్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి తన మద్దతు ఉంటుందని, ముఖ్యమంత్రితో మాట్లాడి జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చేవిధంగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా సమావేశానికి రావాల్సిన రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్ కుమార్ యాదవ్ కూడా అత్యవసర పని వల్ల రాలేకపోయారు. ఆయన కూడా సొసైటీ సమావేశానికి మద్దతు తెలియజేశారు. అంతకు ముందు సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నైశిదం సత్యనారాయణ మూర్తి, తెలంగాణ జనసమితి గ్రేటర్ బీసీ సెల్ అధ్యక్షుడు జశ్వంత్, సీనియర్ జర్నలిస్టులు తీగవరపు శాంతి, నాగవాణి, సొసైటీ కోశాధికారి తన్నీరు శ్రీనివాస్, డైరెక్టర్లు యర్రమిల్లి రామారావు. రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై అధికారులతో కలిసి మాజీ కార్పొరేటర్ పర్యటన



**మల్కాజ్‌గిరి జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** గత ప్రజావాణిలో అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సమస్యలపై మల్కాజ్‌గిరి మాజీ కార్పొరేటర్ శ్రావణ్ మంగళవారం జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, సంబంధిత అధికారులతో కలిసి సమస్యాత్మక ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా సరికొండ నరసింహారెడ్డి నగర్ ప్రాంతంలో పలువైపుల నుంచి నాలాలు, బాక్స్ డ్రైన్ల ద్వారా వచ్చే వరదనీరు నిలిచిపోతున్న సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సంబంధించిన పనులు కొంత మేర పూర్తయినప్పటికీ, పూర్తి స్థాయిలో చేపట్టాలని కోరారు. అలాగే డీ-సిల్టింగ్ పనులు నిర్వహిస్తే వరదనీరు ఎలాంటి ఆటంకం లేకుండా వెళ్లిపోయే అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా రైల్వే ట్రాక్ ఎడమవైపు ఉన్న ఎక్స్‌టెన్షన్ ప్రాంతం నుంచి బాక్స్ డ్రెన్ నిర్మాణాన్ని గతంలో ప్రతిపాదించామని, ఆ పనులకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని శ్రావణ్ విజ్ఞప్తి చేశారు. సరికొండ నరసింహారెడ్డి గార్డెన్స్ ఎదురుగా నాలా పక్కన ఉన్న రహదారి ప్రాంతంలో కొందరు మద్యం సీసాలు పడేయడం, బహిరంగంగా మరుగుదొడ్లుగా వినియోగించడం వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. అక్కడ ఫుట్‌పాత్ నిర్మించి, ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ అంశాలపై స్పందించిన జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, స్ట్రీట్ లైట్లు, నాలా నిర్మాణం, రోడ్ల అభివృద్ధి, ఓపెన్ జిమ్ ఏర్పాటు తదితర పనులకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే తనకు పంపించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో డి.ఈ. లౌక్య, ఏ.ఈ. దివ్యజ్యోతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, జైకృష్ణ, చారీ సత్తిరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదుకు శ్రీకారం

- బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు, సర్ ప్రక్రియపై అవగాహన సదస్సు
- గులాబి శ్రేణులకు జైపాల్ యాదవ్ పిలుపు
- వెల్దండలో నిర్వహించనున్న సమావేశానికి ప్రముఖ నేతల హాజరు

**వెల్దండ జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ జాతిపిత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పిలుపు మేరకు కల్వకుర్తి నియోజకవర్గంలో చేపట్టనున్న సర్ ప్రక్రియ మరియు బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సును ఏర్పాటు చేసినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ సమావేశం జూన్ 4వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు వెల్దండ మండలంలోని తోడేటి చెన్నా రెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సెక్రటరీ, నాగర్‌కర్నూల్ ఇన్‌చార్జి మెట్టు శ్రీనివాస్, కల్వకుర్తి సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి రజనీ సాయిచంద్ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడం, సర్ ప్రక్రియపై పార్టీ శ్రేణులకు స్పష్టమైన అవగాహన కల్పించడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పార్టీ అధిష్టానం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని బూత్‌స్థాయి లో ఎంపికైన గులాబీ శ్రేణులు, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు, మండల సమన్వయ కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, తాజా మరియు మాజీ ప్రజా ప్రతినిధులు ఈ సమావేశానికి తప్పని సరిగా హాజరు కావాలని కోరారు. పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను గ్రామ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఈ సమావేశం దోహదపడు తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ పెద్దలు సభ్యత్వ నమోదు విధానం, డిజిటల్ ప్లాట్‌ఫారమ్ వినియోగం, క్షేత్రస్థాయి కార్యాచరణ, సర్ ప్రక్రియ అమలుపై దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. అలాగే కార్యకర్తల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించి పార్టీ బలోపేతానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వెల్దండ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పుట్టా రాంరెడ్డి, కల్వకుర్తి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, కల్వకుర్తి మాజీ ఎంపీపీ గోవర్ధన్ గుప్తా, నిరంజన్, జోగయ్యతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## తాగి రాష్ డ్రైవింగ్.. ఇంటిని ఢీకొన్న కారు..

- రావిచేడులో తృటిలో తప్పిన పెను ప్రమాదం

**కడ్తాల్, జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలంలోని రావిచేడు గ్రామంలో మంగళవారం సాయంత్రం తాగి వాహనం నడిపిన ఓ కారు డ్రైవర్ నిర్లక్ష్యంతో పెను ప్రమాదం తృటిలో తప్పింది. నందిగామ మండలం అప్పరెడ్డి గూడ గ్రామానికి చెందిన చిన్నంతగారి శ్రీనివాస్ మైసిగండి దేవాలయం వద్ద పార్టీకి హాజరై తిరుగు ప్రయాణంలో అతివేగంగా నడపడంతో కారు అదుపు తప్పి రావిచేడు గ్రామంలోని మహమ్మద్ అలీ ఇంటిని ఢీకొనడంతో గ్రామంలో ఒక్కసారిగా కలకలం రేగింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామంలోని అంతర్గత రహదారిపై వేగంగా దూసుకొచ్చిన కారు నియంత్రణ కోల్పోయి నేరుగా ఓ ఇంటి గోడను ఢీకొట్టింది. ఘటన సమయంలో ఇంట్లో కుటుంబ సభ్యులు ఉన్నప్పటికీ అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే కారు ఢీకొట్టడంతో ఇంటి ప్రధాన ద్వారం మరియు గోడకు స్వల్ప నష్టం వాటిల్లింది. పెద్ద శబ్దం వినిపించడంతో స్థానికులు భయాందోళనకు గురై వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. కారు డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు గ్రామస్తులు ఆరోపించారు. వారు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ప్రమాదం మరింత తీవ్రంగా మారి ఉంటే ప్రాణనష్టం జరిగే అవకాశం ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై వివరాలు సేకరించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. గ్రామంలో తరచూ రాష్ డ్రైవింగ్ ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. తాగి వాహనం నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.



# తాండూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**వికారాబాద్, జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ స్నేహ మెహ్రా తాండూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీసింగ్ సేవల పనితీరును సమీక్షించారు. ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ తనిఖీలో స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, కార్యాలయ నిర్వహణ, రికార్డుల భద్రత, సిబ్బంది విధి నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ డైరీలు, పెండింగ్ కేసుల పురోగతి, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, హిస్టరీ షీట్లు, ఆర్డర్ బుక్, బీట్ బుక్స్, వారెంట్ల అమలు స్థితిగతులు, స్వాధీనం చేసుకున్న ఆస్తుల రికార్డులు కేసు ప్రాపర్టీల భద్రత వంటి అంశాలను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు, పోలీస్, ప్రజల మధ్య సాన్నిహిత్యాన్ని పెంపొం దించేలా అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి రికార్డులు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. మహిళలు, చిన్నారుల రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, వారిపై జరిగే నేరాల కేసుల్లో వేగవంతమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ రాత్రి వేళల్లో గస్తీని మరింత బలోపేతం చేయాలని, పాత నేరస్థుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. రాబోయే బోనాలు, మొహర్రం పండుగల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేకదృష్టి సారించాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాల నిఘాను మరింత పటిష్టం చేయాలని సూచించారు. జిల్లా పోలీస్‌శాఖకు మంచి పేరు తీసుకొచ్చే విధంగా ప్రజా సేవకు అంకితభావంతో పని చేయాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్, ఎస్ఐలు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## వనమహోత్సవానికి సన్నద్ధం కావాలి..

- డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్..

**మల్కాజ్‌గిరి జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యా చరణలో భాగంగా 90వ రోజు పూర్తయిన సందర్భంగా, రాబోయే ప్రపంచ పర్యావరణ దినోత్సవం వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మొక్కల పెంపకానికి అనువైన స్థలాలను గుర్తించడం, ఇప్పటికే ఉన్న పార్కుల్లో మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా ఏపీఐఐసీ కాలనీ, మౌలాలీలోని పార్కులో బుధవారం మొక్కల నాటడం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, డిప్యూటీ డైరెక్టర్ (యూబీడీ) పార్కులో మొక్కలు నాటారు. అనంతరం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతూ, కాలనీల్లోని పార్కులు రహదారుల ఇరువైపులా మొక్కలు నాటేందుకు రాబోయే వర్షాకాలం అత్యంత అనుకూలమైన సమయమని పేర్కొన్నారు. వనమహోత్సవ కార్యక్రమాల నిర్వహణకు అందరూ సిద్ధంగా ఉండాలని కోరారు. అలాగే మల్కాజ్గిరి సర్కిల్ పరిధిలో విస్తృత స్థాయిలో మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సందీప్, అసిస్టెంట్ డిప్యూటీ డైరెక్టర్, శ్రీనివాస్ (శానిటరీ సూపర్వైజర్), వెంకటేష్, రవీందర్, రాజు, యూబీడీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ఏపీఐఐసీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కాలనీవాసులు పాల్గొన్నారు.



# 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్టె విత్తనాల పంపిణీ..

- జనుము, జీలుగ విత్తనాలను రైతులకు అందజేసిన ప్రజాప్రతినిధులు
- భూసారం పెంపుతో దిగుబడులు మెరుగుపడతాయని సూచన

**ఆమనగల్ జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** రైతులకు సేంద్రియ వ్యవసాయం పట్ల అవగాహన కల్పిస్తూ భూసారాన్ని పెంపొందించే లక్ష్యంతో జనుము, జీలుగ పచ్చిరొట్టె విత్తనాలను 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేశారు. బుధవారం ఆమనగల్ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమనగల్ పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేష్, మున్సిపల్ చైర్మన్ డా.పత్య నాయక్ పాల్గొని రైతులకు విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికంగా రసాయన ఎరువుల వినియోగం కారణంగా భూసారం క్షీణించడంతో పాటు పంటల దిగుబడులు తగ్గిపోతున్నాయని అన్నారు. దీంతో రైతులపై పెట్టుబడి భారం పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా పచ్చిరొట్టె పంటలైన జనుము, జీలుగ సాగును రైతులు ప్రోత్సహించాలని సూచించారు. పచ్చిరొట్టె ఎరువుల వాడకం వల్ల నేలలో సేంద్రియ పదార్థం పెరిగి భూమి గుల్లబారుతుందని, వర్షపు నీరు భూమిలోకి సులభంగా ఇంకుతుందని తెలిపారు. దీంతో భూగర్భ జలాల సంరక్షణతో పాటు పంటలకు అవసరమైన తేమ కూడా ఎక్కువ కాలం నిల్వ ఉంటుందని వివరించారు. నేలలో సూక్ష్మజీవుల వృద్ధి పెరిగి జీవరసాయనిక చర్యలు మెరుగు పడటంతో భూసారం, ఉత్పాదకత సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. పచ్చిరొట్టె పంటలను పూత దశలోనే నేలలో కలియ దున్నడం ద్వారా అధిక పరిమాణంలో నత్రజని సహా ఇతర పోషకాలు నేలకు అందుతాయని, తద్వారా తదుపరి పంటలకు మంచి దిగుబడులు వస్తాయని వ్యవసాయ అధికారులు వివరించారు. అలాగే కలుపు మొక్కల పెరుగుదలను కూడా ఈ పద్ధతి సమర్థవంతంగా నియంత్రిస్తుందని పేర్కొన్నారు. రైతులు సేంద్రియ పద్ధతులను ఎక్కువగా అనుసరించడం ద్వారా భూమి ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా వ్యవసాయ వ్యయాలు కూడా తగ్గుతాయని, దీర్ఘకాలికంగా వ్యవసాయం లాభదాయకంగా మారుతుందని నాయకులు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకుని రైతులు పచ్చిరొట్టె పంటల సాగును విస్తరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎనుముల రమేష్, బీఆర్ఎస్ నాయకులు సైదులు గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్ నాయక్, మహేష్, పీఏసీఎస్ సీఈఓ పద్మాకర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్, వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) బాలకృష్ణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సత్యం, ఏఆర్ఎస్కే షాపు యజమాని చంద్రమౌళి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జైపాల్ యాదవ్

- మర్యాదపూర్వకంగా కలిసిన గోలి శ్రీనివాస్ రెడ్డి, దశరథ్ నాయక్, లక్ష్మీ నర్సింహారెడ్డి తదితరులు
- తెలంగాణ అభివృద్ధిలో హరీష్ రావు సేవలు చిరస్మరణీయం



**కడ్తాల్ జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదినం సందర్భంగా ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్, కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం తదితరులు హాజరై హరీష్ రావును సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో హరీష్ రావు పాత్ర విశిష్టమైనదని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా, ప్రజలతో మమేకమై పనిచేసే ప్రజానాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. మంత్రి హోదాలో సాగునీరు, వ్యవసాయం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రజాసేవ పట్ల ఆయనకున్న అంకితభావం, పరిపాలనా దక్షత, కష్టపడి పనిచేసే నాయకత్వ లక్షణాలు యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రజల పట్ల హరీష్ రావు చూపుతున్న నిబద్ధత, సేవా దృక్పథం ఆయనను ప్రత్యేక నాయకుడిగా నిలబెట్టాయని పేర్కొన్నారు. హరీష్ రావు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండి ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహారెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కంబాల పరమేష్, గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, మంగళపల్లి నరసింహ, హెచ్ఆర్ మహేష్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి..

- మృతుడి గుర్తింపునకు ప్రజల సహకారం కోరుతున్న మల్కాజ్‌గిరి పోలీసులు..

**మల్కాజ్‌గిరి జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** మల్కాజ్‌గిరిలోని మౌలాలి ఫ్లైఓవర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మల్కాజిగిరి పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, జూన్ 2 అర్ధరాత్రి సుమారు 12:30 గంటల సమయంలో మౌలాలి రైల్వే స్టేషన్ రోడ్‌లోని అంబేద్కర్ నగర్ ప్రాంతం వద్ద మౌలాలి ఫ్లైఓవర్‌పై ఈ ప్రమాదం జరిగింది. మౌలాలి నుండి తార్నాక వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సుమారు 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో అతడిని వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ, చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడు మౌలాలి ఫ్లైఓవర్ పరిసర ప్రాంతాల్లో ఉంటూ భిక్షాటన చేసుకునేవాడని పోలీసులు తెలిపారు. ఇప్పటి వరకు మృతుడి గుర్తింపు తెలియరాకపోవడంతో, అతని వివరాలు తెలిసిన వారు లేదా కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే వెంటనే మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌లో లేదా ఫోన్ ద్వారా 8712662691, 8712662141 సమాచారం అందించాల్సిందిగా పోలీసులు విజ్ఞప్తి చేశారు.



## వరి ధాన్యం సేకరణ లక్ష్యాలను అధిగమించాలి

- అదనపు కలెక్టర్ కె.వెంకటాచారి..

**వికారాబాద్, జూన్ 04 (జర్నలిస్ట్ ఫైల్) :** వరి ధాన్యం సేకరణలో రైస్ మిల్లర్లు ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను అధిగమించేలా కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ కె.వెంకటాచారి సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వరి ధాన్యం సేకరణపై రైస్ మిల్లర్లు, లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రతి రైస్ మిల్లు కనీసం 2 లక్షల 20 వేల బస్తాల ధాన్యాన్ని స్వీకరించేలా ఏర్పాట్లు చేసుకోవాలని, జూన్ 6వ తేదీలోపు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ధాన్యం సేకరణ పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఉన్న 130 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని మిల్లులకు నిరంతరాయంగా తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్‌లో జాప్యం జరుగుతున్నందున హమాలీల సంఖ్యను పెంచుకోవాలని, అలాగే లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు కూడా వాహనాల సంఖ్యను పెంచి ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు చేర్చేలా చూడాలని సూచించారు. వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని, గోనె సంచులు, తూనిక యంత్రాలు, తేమ కొలిచే యంత్రాలు అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ధాన్యం నిల్వల కోసం అవసరమైతే అదనపు మధ్యంతర గోదాములను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల జనరల్ మేనేజర్ అభిషేక్, డీజీఎం ఇర్ఫాన్, సూపరింటెండెంట్ ఇద్రీష్, జిల్లా పౌర సరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, జిల్లా సహకార అధికారి నాగార్జున, డీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ వెంకట్ రామ్ రెడ్డి, అదనపు డీఆర్‌డీఓ నర్సింలు, డీపీఎం కొమురయ్య, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బాలేశ్వర్ గుప్త, శ్రీధర్ రెడ్డి, రైస్ మిల్లర్లు లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పథకాల లబ్ధికి ఈ-కేవైసీ తప్పనిసరి



○ నగర కమిషనర్ కె. మయూర్ అశోక్

గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ నిరంతరాయంగా అందాలంటే ప్రజలు తప్పనిసరిగా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు.
ఈ-కేవైసీ పూర్తి చేయడం ద్వారా ప్రభుత్వ పథకాల లబ్ధి పారదర్శకంగా, సకాలంలో అందుతుందని పేర్కొన్నారు. ఇంకా ఈ ప్రక్రియ పూర్తి చేయని వారు వెంటనే ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకుని ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రజలు ప్రభుత్వ సేవలు, ధ్రువపత్రాలు, ఇతర సమాచారాన్ని సులభంగా పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "మనమిత్ర" యాప్‌ను వినియోగించుకోవాలని కోరారు.
ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా డిజిటల్ విధానంలో సేవలు పొందేందుకు మనమిత్ర యాప్ ఉపయోగపడుతుందని తెలిపారు. వార్డు సచివాలయ కార్యదర్శులు తమ పరిధిలో ప్రజలకు ఈ-కేవైసీ, మనమిత్ర యాప్‌పై అవగాహన కల్పించాలని, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దివ్యాంగులకు సహాయం అందించాలని ఆదేశించారు. నగరంలో వంద శాతం ఈ-కేవైసీ పూర్తయ్యేలా ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.

## రూ.28 లక్షల విలువైన 140 మొబైల్ ఫోన్లు బాధితులకు అప్పగించిన పోలీసులు



గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ) :పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో గుర్తించి బాధితులకు తిరిగి అందజేయడంలో గుంటూరు జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ రూ. 28 లక్షల విలువైన 140 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేశారు.
జిల్లా ఐటీ కోర్ విభాగం ఇప్పటివరకు సుమారు రూ. 8.73 కోట్ల విలువైన 4,364 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించినట్లు తెలిపారు.
మొబైల్ ఫోన్లు పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. సాంకేతిక ఆధారాలతో మొబైల్ ఫోన్లను గుర్తించి ఎలాంటి రుసుము లేకుండా తిరిగి అందజేస్తున్నామని తెలిపారు.
ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు చేస్తున్న వారి పట్ల జాగ్రత్త వహించాలని, బ్యాంకు వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డులు ఎవరికీ ఇవ్వవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద లింకులు, యాప్‌లు, ఆన్‌లైన్ ఆఫర్లను నమ్మవద్దని, మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు. మొబైల్ రికవరీలో కృషి చేసిన ఐటీ కోర్, సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి



గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ) : రాజధాని భూముల భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సి.ఆర్.డి.ఎ అడిషనల్ కమీషనర్ కొల్లాబత్తుల కార్తీక్ తో కలసి రాజధాని భూసేకరణ గురించి జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ - 3, ఈ - 13, ఈ -15 పరిధిలోని సీడ్ యాక్సిస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జి, ఎన్ హెచ్ 16 ను కలిపే విధంగా ట్రంకు రోడ్డు తదితర నిర్మాణాలకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియలో పెండింగ్ అంశాల గురించి చర్చించారు. ఇరిగేషన్, రైల్వే తదితర శాఖలకు సంబంధించిన భూముల విషయంలో పూర్తి సమాచారంతో కూడిన వివరణాత్మక ప్రతిపాదనలు సమర్పించవలసిందిగా సూచించారు. ఆర్డీవోలు, తహసిల్దార్లు ఇతర శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో సంయుక్త తనిఖీలు నిర్వహించి ఎటువంటి పెండింగ్ లేకుండా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఆర్ అండ్ ఆర్ సర్వే త్వరగా పూర్తి చేయాలన్నారు. లంక భూములకు సంబంధించి ఏకీకృత నివేదికలు తయారు చేయాలన్నారు. గ్రామ కంఠాలు, ముటేషన్స్ విషయంలో ఆర్డీవోలు ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో డి ఆర్ ఓ ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసరావు, సి ఆర్ డి ఏ అధికారులు, డిప్యూటీ కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు ఉచిత వైద్య పరీక్షల శిబిరం



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్ ):అంగలకుదురులో నిర్వహించిన ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా హ్యాపీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులకు బీపీ, షుగర్, ఎత్తు, బరువు, బాడీ మాస్ ఇండెక్స్ (దీవీ×) తదితర పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి తగిన వైద్య సూచనలు, సలహాలు తెలియజేస్తారు. ఈ సందర్భంగా హ్యాపీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ చైర్మన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఆరోగ్య పరిరక్షణకు తమ సంస్థ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో హ్యాపీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కరస్పాండెంట్ డాక్టర్ పావని ప్రియాంక , డీన్ పుష్పలత , ప్రిన్సిపాల్ కంచర్ల నిర్మల, మండల విద్యాశాఖాధికారి మేఘాల లక్ష్మీనారాయణ, కొల్లిపర మండల విద్యాశాఖాధికారి శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు మరియు ఇతర సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన హ్యాపీ హాస్పిటల్ మరియు హ్యాపీ కాలేజ్ యాజమాన్యాన్ని ఉపాధ్యాయులు అభినందించారు.

# దిగ్విజయంగా కూటమి రెండేళ్ల పాలన : ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):కూటమి ప్రభుత్వం 2 సంవత్సరములు దిగ్విజయంగా పూర్తి చేసుకొని 3వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా మరియు వైసీపీ నాయకుల కుటిల మీడియా ప్రకటనలపై నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించి ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా. బూర్ల రామాంజనేయులు ఘాటుగా స్పందించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ జూన్ 4వ తేదీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజని, వైసీపీ నాయకుల భయాన్ని కప్పిపుచ్చుకునేందుకు వెన్నుపోటు అంటూ రోడ్డెక్కుతున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు . గతంలో ప్రజలు అధికారం ఇస్తే మూడుముక్కలాట ఆడారన్నారు. పోలవరం ప్రాజెక్టు నడ్డి విరిచారన్నారు .ఐదేళ్ళ వైసీపీ పాలనలో ఒక్క టీచర్ ను అయినా నియమించారా అంటూ ప్రశ్నించారు. యువ నాయకులు లోకేష్ మెగా డిఎస్సీ ద్వారా నిరుద్యోగులకు 15,500 ఉద్యోగాలు ఇచ్చారన్నారు . ప్రజలు ఇచ్చిన తీర్పు వెన్నుపోటు అయితే గతంలో మీకు ప్రజలు అధికారం ఇస్తే దానిని ఏమనాలని అన్నారు .యాభై సంవత్సరాల రైతులు కల గుంటూరు ఛానల్ అభివృద్ధి కి కూటమి ప్రభుత్వం కంకణం కట్టుకుని పనిచేస్తుందన్నారు .
గతంలో రైతులకు వెన్నుపోటు పొడిచి వారిని అన్యాయం చేసింది వైసీపీ పార్టీ అని తెలిపారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను ప్రక్కదారి పట్టించి పేదలకు వెన్నుపోటు పొడిచింది వైసీపీ అన్నారు .కల్తీ మద్యం ద్వారా 2019-24 మధ్య ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. భూరక్ష టైటిల్ తెచ్చి భూభక్ష గా మార్చేసారన్నారు. రాష్ట్రానికి పారిశ్రామిక వేత్తలు రాకుండా తరిమి కొట్టారన్నారు. 23 లక్షల కోట్ల పెట్టుబడులు కూటమి హయాం లో పెట్టుబడులు వస్తున్నాయని ,దాని ద్వారా 30 లక్షల ఉద్యోగాలు యువతకు వస్తాయన్నారు . కక్ష్య కార్పణ్యాల తో కూడిన పార్టీ వైసీపీ పార్టీ అన్నారు .కూటమి ప్రభుత్వం ఈ రెండేళ్ళలో అన్యాయంగా ఎవరిమీదా కేసులు పెట్టలేదన్నారు .అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళలా సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు .తొమ్మిది వందల కోట్లతో రోడ్లపై గుంతలు పూడ్చామన్నారు .వైసీపీ ప్రభుత్వం లక్షా ఇరవై ఒక్క కోట్లు విద్యుత్ భారాన్ని ప్రజలపై వేసిందన్నారు .ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మంగళగిరి ప్రభుత్వ వైద్యశాలకు ఉచిత మార్చురీ వ్యాన్ అందజేత

○ హర్వేస్ట్ ఇండియా ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా లో ప్రతి నియోజకవర్గానికి ఒక మార్చురీ వ్యాను ఉచితంగా అందిస్తాం : కత్తెర సురేష్



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్ ): మంగళగిరి ప్రభుత్వ వైద్యశాలకు స్వచ్ఛంద సేవా సంస్థ హర్వెస్ట్ ఇండియా ఆధ్వర్యంలో ఉచిత మార్చురీ వ్యాన్‌ను ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా కత్తెర హెనీ క్రిస్టినా, సురేష్ దంపతులు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో హర్వెస్ట్ ఇండియా సంస్థ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఈ మార్చురీ వ్యాన్ ద్వారా పేద కుటుంబాలకు చివరి ప్రయాణం గౌరవప్రదంగా, ఉచితంగా నిర్వహించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. హర్వెస్ట్ ఇండియా అధినేత డాక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి ఒక మార్చురీ వ్యాన్ అందజేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి పోతిన శ్రీనివాసరావు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా హర్వెస్ట్ ఇండియా సంస్థ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని అభినందించారు. మంగళగిరి ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పి. స్నేహ మాట్లాడుతూ మరణించిన వారి మృతదేహాలను స్వగ్రామాలకు తరలించేందుకు పేద కుటుంబాలు భారీ ఖర్చులు భరించాల్సి వస్తోందని, ఈ ఉచిత మార్చురీ వ్యాన్ వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకి, మాస్ అధ్యక్షుడు, హర్వెస్ట్ ఇండియా మేనేజర్ సుద్దపల్లి నాగరాజు, టీడీపీ పార్లమెంటరీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు చాగంటిపాటి పూర్ణచంద్రరావు, పట్టణ అధ్యక్షుడు పడవల మహేష్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మహమ్మద్ ఇబ్రహీం పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు వాకా మాధవ గౌడ్, బైరుబోయిన శ్రీనివాసరావు, జొన్నాదుల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వివిఐటిని సందర్శించిన సింగపూర్ విద్యార్థులు




అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ): సింగపూర్‌కు చెందిన ప్రముఖ విద్యాసంస్థ 'మిలనీ ఇన్స్టిట్యూట్' విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'వివా' మరియు 'వివిఐటి' విశ్వవిద్యాలయాన్ని సందర్శించారని వివిఐటి యూ ప్రో-ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో సాంస్కృతిక సమ్మేళనంలో భాగంగా ఐదు రోజుల పర్యటనకు విచ్చేసిన సింగపూర్ విద్యార్థులు.. బహుళ సాంస్కృతిక అవగాహన, విద్యావిధానం, సాంకేతికత మరియు సమస్యా పరిష్కారానికి మానవీయ కోణంలో ఆలోచించి 'డిజైన్ థింకింగ్' పద్ధతిలో పరిష్కారాలను కనుగొనడం వంటి అంశాల అవగాహన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇక్కడికి వచ్చారని ఆయన వివరించారు.
ఈ పర్యటనలో భాగంగా వివిఐటి విశ్వవిద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ సంస్కృతిలో భాగమైన కొండపల్లి బొమ్మలు, పర్యాటక ప్రాంతాలైన భవానీ ఐలాండ్, ఉప్పలపాడు పక్షుల సంరక్షణ కేంద్రం వంటి అంశాలపై వివిఐటి విద్యార్థులతో కలిసి సింగపూర్ విద్యార్థులు విషయ విశ్లేషణ (గ్రూప్ డిస్కషన్) నిర్వహించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిఐటి ఛాన్స్ లర్ వాసిరెడ్డి విద్యాసాగర్ సింగపూర్ కళాశాల ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా॥ వై. మల్లికార్జున రెడ్డి, టిఎల్సి హెడ్ డా॥ రావెల నవీన్, యూఐఎఫ్ సమన్వయకర్త, ఐఐసి సమన్వయకర్త పి. ఈ. ఎస్. ఎన్. కృష్ణప్రసాద్ మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

## సెక్షన్ 22 ఏ నుండి మినహాయింపు ఇచ్చి ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేయాలి

○ ఎమ్మార్వో ను కలిసిన బీసీ నాయకులు



తెనాలి, (జర్నలిస్ట్ ఫైల్):1972 వ సంవత్సరంలో పేదలమైన మాకు శ్రీ కూరపాటి రంగరాజు కూరపాటి వెంకటరామరాజు గారి ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలను ఇప్పించమని అప్పటి బీసీ నాయకులు గౌరవనీయులు సేవారత్న తంగెళ్ల శేషం రాజు ని కలిసి కోరడమైనది దానికిగాను తంగెళ్ల శేషం రాజుగ వారి యొక్క బాధలను గమనించి అప్పటి సబ్ కలెక్టర్ చిత్రా రామచంద్రన్ ను ఒప్పించి బంధువులందరికీ ఇళ్ల పట్టాలని ఇప్పించడం జరిగినది అప్పటినుంచి ఇప్పటివరకు దాదాపు 53 సంవత్సరాలుగా నివసిస్తున్నాము మా యొక్క సర్వే నెంబర్లు 125 125/1 125/1బి 125/1ఎ 126 గా ఉన్నవి కానీ ఇప్పుడు వీటికి రిజిస్ట్రేషన్లు చేయడం లేదు మా పిల్లల చదువులకు అవసరాలకు బ్యాంకు నుండి లోన్లు కూడా రావడం లేదు కావున సంఘంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలను సెక్షన్ 22 ఏ నుండి మినహాయింపు ఇచ్చి రిజిస్ట్రేషన్లు చేయవలసినదిగా మండల రెవెన్యూ అధికారికి మెమొరండం ఇవ్వడం జరిగినది. కార్యక్రమంలో పాల్గొన్న వారి పేర్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కేసన శంకర్రావు తెనాలి పట్టణ బట్రాజు సంఘం అధ్యక్షులు లోలబట్టి గంగరాజు కోశాధికారి కూరపాటి సీతారామరాజు తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ కన్వీనర్ సరికొండ రమాదేవి కూరపాటి కొండం రాజు కూరపాటి మట్టం రాజు సరికొండ సోమరాజు ఇనపకుతిక విజయలక్ష్మి తంగెళ్ల సత్యనారాయణ రాజు టీ ప్రసాదరాజు మొదలైన వారు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమ పాలనకు రెండేళ్లు : ప్రభుత్వ చీఫ్ విప్ జీవి



వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, అద్భుతమైన అభివృద్ధి మరియు సంక్షేమ పాలనను అందిస్తూ విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకుందని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 2024 జూన్ 4వ తేదీన వెలువడిన ఎన్నికల ఫలితాలతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటై నేటికి సరిగ్గా రెండేళ్లు పూర్తయిందని గుర్తుచేశారు. ఈ రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం 'సూపర్ సిక్స్' పథకాలను సూపర్ హిట్గా అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందిందని ఆయన కొనియాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, 3000 రూపాయల సామాజిక పింఛనును 4 వేల రూపాయలకు పెంపు, 'తల్లికి వందనం' కింద ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికీ ఒక్కొక్కరికి 15,000 రూపాయల ఆర్థిక సాయం, మరియు 'అన్నదాత సుఖీభవ' ద్వారా రైతులకు ఏడాదికి 20,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందిస్తోందని వివరించారు.
రాష్ట్ర యువత భవిష్యత్తు కోసం 7 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అడుగులు వేస్తూ, యువతకు ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు నిరుద్యోగుల కోసం 16,400 పైచిలుకు పోస్టులతో మెగా డీఎస్సీ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టిందని తెలిపారు. అలాగే చేనేతలకు, నాయి బ్రాహ్మణులకు నిరంతరం ఆర్థిక సహాయం అందిస్తూ వారి సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేస్తూ రూ. 20,000 కోట్ల విదేశీ పెట్టుబడులను రాష్ట్రానికి ఆకర్షించడమే కాకుండా, క్వాంటం కంప్యూటర్ సిస్టమ్, గూగుల్ డేటా బేస్ వంటి అత్యాధునిక సాంకేతిక సంస్థలను రాష్ట్రానికి రప్పించడంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించిందన్నారు. అమరావతి పునర్నిర్మాణాన్ని అత్యంత వేగంగా ముందుకు తీసుకెళ్తూ, పోలవరం ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టిస్తోందని, నదుల అనుసంధానానికి ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు.
అంతేకాకుండా, పర్యావరణ పరిరక్షణ మరియు ఇంధన రంగంలో విప్లవాత్మక మార్పుల కోసం రాష్ట్రంలోని 20 లక్షల ఇళ్లకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసే బృహత్తర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జీవి ఆంజనేయులు స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ సమూల మార్పులు తెచ్చామన్నారు.
అయితే, కూటమి ప్రభుత్వ రెండేళ్ల అద్భుతమైన ప్రజాదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్ రెడ్డి 'వెన్నుపోటు పాలన' అంటూ దుష్ప్రచారం చేస్తూ స్వార్థ రాజకీయాలకు తెరలేపారని మండిపడ్డారు. వైసీపీ నాయకుల కుట్రపూరిత ఉచ్చులో పడొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసిన ఆయన, వైసీపీ ఎన్ని దొంగ ప్రచారాలు చేసినా, కుతంత్రాలు పన్నినా ఆ పార్టీని ప్రజలు మళ్లీ ఎప్పటికీ విశ్వసించరని అన్నారు. రానున్న మూడేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం ఏపీని అభివృద్ధిలో మరింత ముందుకు నడిపిస్తూ, ప్రజలందరికీ అన్ని విధాలా అందుబాటులో ఉంటుందని జీవి ఆంజనేయులు స్పష్టం చేశారు.

## రెండేళ్ల పాలన ప్రజారంజకం



○ ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో అభివృద్ధి వేగవంతం
○ భారీ కేక్ కట్ చేసిన తూర్పు నియోజకవర్గ కూటమి నాయకులు

గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ) :కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన ప్రజారంజకంగా సాగిందని గుంటూరు తూర్పు నియోజకవర్గ కూటమి నాయకులు అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యునిగా నసీర్ ప్రమాణ స్వీకారం చేసి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం స్థానిక పార్టీ కార్యాలయలో కూటమి నాయకులు సంబరాలు నిర్వహించారు. రెండేళ్ల కాలంలో ఎమ్మెల్యే నసీర్ ప్రజల వద్దకు ప్రభుత్వ పాలనను ఎమ్మెల్యే నసీర్ ఎలా తీసుకెళ్లింది ? గత ప్రభుత్వ వైఫల్యాలను అధిగమిస్తూ అభివృద్ధికి బాటలు ఎలా వేసింది వంటి అంశాలపై చర్చించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే నసీర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పదవిని ఒక బాధ్యతగా తీసుకుని ముందడుగు వేశారన్నారు. రెండేళ్లలో ప్రజాసేవలో నిమగ్నమై గుంటూరు తూర్పున అభివృద్ధికి బాటలు వేశారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎటుచూసినా గుంతల రోడ్లు ఉండేవని, ఎమ్మెల్యే నసీర్ పట్టుదలతో అన్ని రోడ్లను అద్దంలా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. తూర్పు నియోజకవర్గంలో వెనుకబడిన ప్రాంతాలను సవాల్ గా తీసుకుని అన్ని మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టారన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న నందివెలుగు బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రసహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో నిధులు రాబట్టారని తెలిపారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన చేపట్టిన వెంటనే బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణానికి రూ. 3 కోట్లకుపైగా నిధులు తెప్పించారన్నారు. అంజుమన్ పాఠశాలను ఎన్నడూలేని విధంగా తీర్చిదిద్దుతున్నారని, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరి గుమ్మానికి తీసుకెళుతున్నారని చెప్పారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఇప్పటికే సుమారు రూ. 11 కోట్లతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడారని తెలిపారు. ప్రజల గుండెల్లో నమ్మకాన్ని రెట్టింపు చేస్తూ సీఎం చంద్రబాబు నాయుడు సహకారంతో పాలనలో పారదర్శకతతోపాటు ప్రతి ఇంటా సంతోషాలు తీసుకొచ్చారని చెప్పారు. యువతకు అండగా ఉపాధి జాబ్ మేళా, పారిశ్రామిక ప్రగతికి బాటలు వేశారని తెలిపారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ మహోన్నత ఆశయంతో బడిబాట పట్టిన పిల్లలకు బంగారు భవిష్యత్తు అందిస్తున్నట్లు చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించేందుకు తామంతా కలిసికట్టుగా పని చేస్తామన్నారు.

## మధ్యాహ్న భోజన పథకం సమర్థవంతంగా నిర్వహించాలి: ఎంఈఓ జయంతి బాబు



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్ ) : తెనాలి మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైమరీ ఉన్నత పాఠశాలల్లో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎండిఎం నిర్వాహకులకు , సహాయకులకు వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రత విధానాలు పాటించేందుకు మండల స్థాయి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం పట్టణంలోని మారీసు పేట నల్లమోతు చెంచు రామానాయుడు మున్సిపల్ హైస్కూల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనం నిర్వాహకులు సహాయకులను ఉద్దేశించి మండల విద్యాశాఖ అధికారి వి జయంతి బాబు మాట్లాడుతూ కుక్ కమ్ హెల్పర్స్ అందరూ సమయపాలన పాటిస్తూ ఆహారాన్ని సురక్షితంగా విద్యార్థులకు ఎలా అందించాలి, వంటగదిని వంట పాత్రల ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకునే విషయాలపై అవగాహన కల్పించారు. ఇంకా వ్యక్తిగత పరిశుభ్రతలో భాగంగా వంట ప్రారంభించే ముందే చేతులు సబ్బు తో శుభ్రంగా కడుక్కోవడం, ప్రభుత్వ ఆదేశాల మేరకు సమయానికి విద్యార్థులకు వేడివేడి భోజనాన్ని అందించడం గురించి తెలియజేశారు. జిల్లా స్థాయిలో శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఎండిఎం నిర్వాహకురాలు రెడ్డి రవణమ్మ ఎండిఎం నిర్వాహకులకు సహాయకులకు పలు సూచనలు చేశారు. ఏం డి ఎం నిర్వాహకులకు వంటలు పోటీలు నిర్వహించి ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాల్లో ఎంపిక చేసిన వారికి బహుమతులు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పఠాన్ కరిముల్లా, ఎన్సిసి ఉపాధ్యాయులు స్వామి, సిఆర్ఎంటి లు శ్రీదేవి, సుజాత, దీపాంజలి మరియు డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనం నిర్వాహకులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# 296 మంది డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతులు

**○ ప్రభుత్వానికి ఏపీఆర్ఎస్ఏ కృతజ్ఞతలు**

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తహసీల్దార్ పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేసి రాష్ట్రంలోని సుమారు 300 తహసీల్దార్ పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వానికి ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది. అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్ ఒక ప్రకటనలో ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు.

రాష్ట్రంలోని నాలుగు జోన్లలో డిప్యూటీ తహసీల్దార్ నుంచి తహసీల్దార్ హోదాకు పదోన్నతుల కోసం డీపీసీ ప్రక్రియను పూర్తి చేసి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. జోన్-1లో 59 మంది, జోన్-2లో 84 మంది, జోన్--3లో 49 మంది, జోన్-4లో 104 మంది... మొత్తం 296 మంది డిప్యూటీ తహసీల్దార్లు ఒకేసారి తహసీల్దార్లుగా పదోన్నతి పొందడం రెవెన్యూ శాఖ చరిత్రలో కీలక ఘట్టమని పేర్కొన్నారు.

గత నాలుగేళ్లుగా కోర్టు కేసుల కారణంగా నిలిచిపోయిన పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేసేందుకు కృషి చేసిన రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్, ముఖ్యమంత్రి, సీసీఎల్ఏ అధికారులు, సిబ్బందికి ఏపీఆర్ఎస్ఏ ధన్యవాదాలు తెలిపింది. మిగిలిన ఖాళీలను కూడా త్వరగా భర్తీ చేస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వీలవుతుందని, ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమలులో అధికారులు మరింత సమర్థవంతంగా పనిచేస్తారని సంఘం పేర్కొంది.

# నేడు విశాఖలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పర్యటన

**○ జాతీయ సీఫుడ్ ఎగుమతుల వర్క్‌షాప్‌లో పాల్గొననున్న కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి**



**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ):** కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ నేడు విశాఖపట్నంలో పర్యటించనున్నారు. అధికారిక పర్యటనలో భాగంగా విశాఖలో నిర్వహించే జాతీయ సముద్ర ఆహార (సీఫుడ్) ఎగుమతుల వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని పరిశ్రమ ప్రతినిధులు, ఎగుమతిదారులతో సమావేశం కానున్నారు.

పర్యటనలో భాగంగా మంత్రి ముందుగా తిరుమలకు చేరుకుని శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకోనున్నారు. అనంతరం తిరుమలలో "ఏక్ పెడ్ మా కే నామ్" కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటనున్నారు. పద్మావతి అమ్మవారి దర్శనం అనంతరం ప్రత్యేక విమానంలో విశాఖపట్నానికి బయలుదేరుతారు.

ఉదయం 11.30 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకోనున్న మంత్రి పీయూష్ గోయల్, మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 8 గంటల వం-కు జరిగే జాతీయ సీఫుడ్ ఎగుమతుల వర్క్‌షాప్‌లో పాల్గొంటారు. ఈ సందర్భంగా సముద్ర ఆహార రంగంలో ఎగుమతుల అభివృద్ధి, అంతర్జాతీయ మార్కెట్ల విస్తరణ, కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై చర్చించనున్నారు. విశాఖపట్నం దేశంలో కీలకమైన సీఫుడ్ ఎగుమతుల కేంద్రాల్లో ఒకటిగా ఉన్న నేపథ్యంలో ఈ వర్క్‌షాప్‌కు ప్రాధాన్యత ఏర్పడింది. మత్స్య పరిశ్రమ అభివృద్ధి, ఎగుమతుల పెంపు, వ్యాపార అవకాశాలపై కేంద్ర మంత్రి కీలక సూచనలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

కార్యక్రమం అనంతరం రాత్రి 9 గంటలకు మంత్రి విశాఖపట్నం నుంచి ముంబైకి బయలుదేరుతారు.

# విఐటీ-ఏపీ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌కు శాప్ చైర్మన్ ప్రశంసలు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవి నాయుడు గురువారం విఐటీ-ఏపీ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. విఐటీ-ఏపీ ప్రథమ అమరావతి అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ నాలుగో రోజు సందర్భంగా ఆయన విశ్వవిద్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా విఐటీ-ఏపీ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ పి. అరుళ్మొళివర్మన్‌తో కలిసి రవి నాయుడు చెస్ ఆడారు. అంతర్జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక చెస్ టోర్నమెంట్‌కు వేదికగా నిలుస్తున్నందుకు విశ్వవిద్యాలయ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. క్రీడల అభివృద్ధికి, యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి అంతర్జాతీయ స్థాయి పోటీలు దోహదపడతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ ఎస్. సంతోష్ కుమార్ పాల్గొన్నారు. విఐటీ-ఏపీ ఉపకులపతి డాక్టర్ పి. అరుళ్మొళివర్మన్, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీశ్ చంద్ర ముదిగంటి, విద్యార్థి సంక్షేమ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఖదీర్ పాషా, ఆంధ్ర చెస్ అసోసియేషన్ చైర్మన్ కె.వి.వి. శర్మ, అధ్యక్షుడు డాక్టర్ సురేష్, కార్యదర్శి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రజా సమస్యల స్వీకరణ కార్యక్రమం

**○ జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ**

**కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రజా పరిపాలనా కార్యక్రమంలో భాగంగా ఒక నెల--ఒక నియోజకవర్గం--నాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని నేడు ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని పెదనందిపాడులో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ వెల్లడించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో కార్యక్రమం మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజలకు నేరుగా పరిపాలనా సేవలు చేరువ చేయడం, స్థానిక సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత నియోజకవర్గ పరిధిలోని మండలాల అధికారులు సమన్వయంతో పాల్గొనాలని సూచించారు. ముఖ్యంగా పెదనందిపాడు, కాకుమాను మండలాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు, అభ్యర్థనలు, వినతిపత్రాలను నేరుగా కార్యక్రమానికి హాజరయ్యే ప్రజా ప్రతినిధులు, అధికారులకు సమర్పించవచ్చని తెలిపారు. ప్రజల నుంచి అందిన అర్జీలను శాఖలవారీగా పరిశీలించి పరిష్కార చర్యలు వేగవంతం చేయనున్నట్లు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, స్థానిక అవసరాలు, అభివృద్ధి అంశాలపై ప్రజల అభిప్రాయాలు స్వీకరించి పరిపాలనను మరింత సమర్థవంతంగా అమలు చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

# తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయాలి : ఎమ్మెల్సీ ఆలపాటి





**తెనాలి, ( జర్నలిస్ట్ ఫైల్)** పట్టణంలోని స్థానిక ఎన్వీఆర్ కళ్యాణ మండపంలో జరిగినతెనాలి నియోజవర్గ దేశం పార్టీ స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్లస్టర్, గ్రామ, వార్డుస్థాయి, తెలుగుదేశం పార్టీ నాయకులు ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ క్యాడర్ను,ఓటర్ ను కాపాడుకోవాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందని ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా కొత్తగా ఓటర్లను జాయిన్ చేయాల్సిన బాధ్యత ఉండటంతో పాటుగా చనిపోయిన వారి ఓట్లతో పాటుగా, కోటి ఉండి కూడా ఎవరైతే ఆయా ప్రాంతంలో ఉండటం లేదు అనే విషయాలను తెలుసుకోవాల్సిన బాధ్యత క్లస్టర్,గ్రామ,వార్డు స్థాయి ఇన్చార్జిలకు ఉందని విషయాన్ని ఆయన తెలిపారు. తెలుగుదేశం పార్టీ ని అన్ని విధాలుగా బలోపేతం చేయాలని ఆయన నాయకులకు దిశ దశను చేశారు. రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అన్ని దశలో విజయాన్ని సాధించేందుకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని ఎమ్మెల్సీ ఆలపాటి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు క్లస్టర్ ఇన్చార్జిలు గ్రామస్థాయి, వార్డ్ స్థాయి ఇన్చార్జిలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ఆఫ్‌లైన్ విధానంలో ప్రత్యేక టెట్ నిర్వహించాలి

**○ పీఆర్టీయు-ఏపీ డిమాండ్**

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** సర్వీసులో ఉన్న ఉపాధ్యాయుల కోసం ఆఫ్‌లైన్ విధానంలో ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించాలని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ ఆంధ్రప్రదేశ్ (పీఆర్టీయు-ఏపీ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు వినతిపత్రం సమర్పించినట్లు పీఆర్టీయు-ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఏ.ఎం. గిరి ప్రసాద్ తెలిపారు.

జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) నిబంధనల ప్రకారం పదోన్నతులు, బదిలీలు, ఇతర సర్వీసు ప్రయోజనాలకు టెట్ తప్పనిసరి కావడంతో వేలాది మంది సీనియర్ ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉపాధ్యాయులకు ప్రత్యేక అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

40 నుంచి 50 ఏళ్లకు పైబడిన సర్వీసు ఉపాధ్యాయులు ఆన్‌లైన్ పరీక్ష విధానంలో సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటున్నారని, అందువల్ల సాధారణ టెట్‌తో పాటు సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ఓఎంఆర్/ఆఫ్‌లైన్ విధానంలో ప్రత్యేక టెట్ నిర్వహించాలని పీఆర్టీయు-ఏపీ డిమాండ్ చేసింది. ప్రస్తుతం గణితం, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం అభ్యర్థులకు కలిపి నిర్వహిస్తున్న పేపర్-2ఏ విధానాన్ని మార్చి, సబ్జెక్టుల వారీగా వేర్వేరు పేపర్లు ఏర్పాటు చేయాలని సూచించింది. ఉపాధ్యాయులు తాము బోధించే సబ్జెక్టుకు సంబంధించిన పరీక్ష మాత్రమే రాసేలా నిబంధనలు మార్చాలని కోరింది.

డీఎస్సీ ద్వారా నియమితులై 10 నుంచి 30 సంవత్సరాల అనుభవం ఉన్న ఉపాధ్యాయులను కొత్త అభ్యర్థులతో సమానంగా చూడటం సరికాదని పీఆర్టీయు-ఏపీ పేర్కొంది. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అర్హత ప్రమాణాలను హేతుబద్ధీకరించాలని కోరింది. ఎన్‌సీటీఈ మార్గదర్శకాల ప్రకారం అర్హత ప్రమాణాలను నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని, టెట్ అనేది కనీస అర్హత పరీక్ష మాత్రమేనని, నియామక పరీక్ష కాదని యూనియన్ నేతలు తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించడం ద్వారా పాఠశాల విద్యా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# అరాచక పాలనకు ముగింపు పలికిన ప్రజా ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తి

**○ స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా వేగంగా అడుగులు : రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు**



**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అరాచకాలు, అవినీతి, విధ్వంసకర విధానాలకు ప్రజలు ముగింపు పలికి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన చారిత్రక సందర్భానికి నేటితో రెండేళ్లు పూర్తయ్యాయని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆశయాలకు అనుగుణంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం గత రెండేళ్లుగా పారదర్శక పరిపాలన, అభివృద్ధి, సంక్షేమం అనే మూడు ముఖ్య లక్ష్యాలతో ముందుకు సాగుతోందన్నారు. గత పాలనలో రాష్ట్రం ఆర్థిక, సామాజిక, పారిశ్రామిక రంగాల్లో వెనుకబడిందని, ప్రజాస్వామ్య విలువలు దెబ్బతిన్నాయని విమర్శించారు.

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర పునర్నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. మౌలిక వసతుల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి అవకాశాలు, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

ప్రజల విశ్వాసమే ప్రభుత్వానికి ప్రధాన బలం అని పేర్కొంటూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. "స్వర్ణాంధ్రప్రదేశ్" లక్ష్యంతో ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చిన ఆయన, ప్రజల సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

"ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకోవడం ఆనందదాయకం. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనతో స్వర్ణాంధ్ర సాధన కోసం అందరం కలిసికట్టుగా ముందుకు సాగుదాం" అని సానా సతీష్ బాబు పిలుపునిచ్చారు.

# ఎస్ఆర్ఎం పబ్లిక్ స్కూల్ ప్రారంభం



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** మంగళగిరి మండలం నీరుకొండలోని ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఎం పబ్లిక్ స్కూల్ ను సీఆర్డీఏ అదనపు కమిషనర్ ఏ. భార్గవతేజ గురువారం ఉదయం ప్రారంభించారు. అనంతరం స్కూల్ ముఖ్య సలహాదారు కేఆర్ మాలతి అధ్యక్షతన జరిగిన పాఠశాల ప్రారంభ సభలో విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి అదనపు కమిషనర్ భార్గవ తేజ ప్రసంగించారు. రాజధాని అమరావతిలో ఎస్ఆర్ఎం విద్యా సంస్థల యాజమాన్యం మొట్టమొదటి పబ్లిక్ స్కూల్ ను నెలకొల్పడం అభినందనీయమన్నారు. రానున్న ఏడాది కాలంలో సుమారు 4 వేల మంది ఉద్యోగులు రాజధానిలో నివాసముండే వీలున్నందున వారి చిన్నారుల విద్యా ప్రయోజనాకు ఎస్ఆర్ఎం స్కూల్ ఎంతో ప్రయోజనకరంగా మారే వీలుందన్నారు. నాణ్యమైన మరియు భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన విద్య ఎస్ఆర్ఎం పబ్లిక్ స్కూల్లో లభించే అవకాశముందన్నారు. త్వరిత గతిన అభివృద్ధి చెందుతున్న అమరావతిలో చిన్నారుల కోసం అత్యుత్తమ ప్రమాణాలతో స్కూలు ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఎం ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్ మాట్లాడుతూ, చిన్నారుల మానసిక వికాసానికి అనుగుణంగా ఉత్తమ ప్రమాణాలతో విద్యను అందించే లక్ష్యంతో యాజమాన్యం పబ్లిక్ స్కూల్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

స్కూల్ ముఖ్య సలహాదారు కేఆర్ మాలతి చెన్నైలో ఉన్న ఎస్ఆర్ఎం పబ్లిక్ స్కూల్ వివరాలను, సాధించిన ప్రగతిని వివరించారు. ప్రారంభించిన మొదటి ఏడాదిలో కేజీ నుంచి సెకండ్ గ్రేడ్ వరకూ తరగతులు నిర్వహించనున్నామనీ, బోధనలో మంచి అనుభవం ఉన్న ఉపాధ్యాయులను నియమించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంతరిక్ష పరిశోధనలు, శాటిలైట్ లాంచింగ్ లో ప్రతిభ కనబరిచిన చెన్నై స్కూలు విద్యార్థులను మాలతి ముఖ్య అతిథి భార్గవ్ తేజకు పరిచయం చేశారు.

అనంతరం స్కూల్ కరస్పాండెంటెంట్ ఎం సుబ్రహ్మణ్యం, మాలతిలు అతిథులను దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఇన్చార్జి వీసీ ఆచార్య సీవీ టామి, డాక్టర్ ప్రేమ్కుమార్, హెచ్ఎర్ డైరెక్టర్ ఐజక్ సామల, రమేష బాబు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల్లో నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించాలి



**○ వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశం**

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** వచ్చే ఏడాది జూన్ లో జరగనున్న పవిత్ర గోదావరి పుష్కరాల్ని పురస్కరించుకుని వైద్య సేవల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. ముఖ్యంగా నేత్ర వైద్య శిబిరాల్ని నిర్వహించాలని స్పష్టంచేశారు. 'ఆంధ్రప్రదేశ్ రైట్ టు సైట్ సొసైటీ' గవర్నింగ్ బాడీ సమావేశం వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో 11 ఏళ్ల అనంతరం తొలిసారిగా మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ అధ్యక్షతన గురువారం జరిగింది. దీనికి సీఎం చైర్మన్ గా ఉన్నారు. వైస్-చైర్మన్ గా ఉన్న మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ పారా మెడికల్, ఆప్తాల్మిక్ ఖాళీల భర్తీకి ప్రాంతీయ సంచాలక కార్యాలయాలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖాళీల భర్తీకి జీరో వేకెన్సీ విధానాన్ని వర్తింప చేయాలని అధికారులకు స్పష్టంచేశారు. అలాగే.. పారా మెడికల్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ కోర్సు నిర్వహణ, రిజిస్ట్రేషన్ల నిర్వహణ గురించి విపులంగా ఈ సమావేశంలో చర్చించారు. జాతీయ అంధత్వ నియంత్రణ, దృష్టిలోపాల నివారణ కార్యక్రమాల అమలు పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. వైద్య సేవలు ఇంకా మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టంచేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైద, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎఫ్ఎల్ఎన్ శిక్షణలకు మౌలిక వసతులు కల్పించి మధ్యాహ్నం వరకే నిర్వహించాలి

**○ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్**

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఫ్లూచీ) శిక్షణలకు హాజరవుతున్న ఉపాధ్యాయులకు తగిన మౌలిక వసతులు కల్పించాలని, ఎండ తీవ్రత దృష్ట్యా శిక్షణలను మధ్యాహ్నం వరకు మాత్రమే నిర్వహించాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేసవరపు జాలిరెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ జంషీద్ ప్రభుత్వాన్ని కోరారు.

విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం ఉపాధ్యాయులు శిక్షణలకు హాజరవుతున్నప్పటికీ, అనేక కేంద్రాల్లో తాగునీరు, భోజనం, ఫ్యాన్లు, కూలింగ్ సౌకర్యాలు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు వంటి కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పుల నేపథ్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు శిక్షణలు నిర్వహించడం ఆరోగ్యానికి హానికరమని పేర్కొన్నారు.

మహిళా ఉపాధ్యాయులు, వృద్ధులు, ఆరోగ్య సమస్యలు ఉన్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున శిక్షణలను ఉదయం వేళల్లో నిర్వహించి మధ్యాహ్నం 1 గంటలోపు ముగించాలని డిమాండ్ చేశారు. అలాగే పాఠశాల విధులతో పాటు శిక్షణల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులకు సంపాదిత సెలవు సౌకర్యం కల్పించాలని కోరారు. శిక్షణ కేంద్రాల్లో తక్షణమే తాగునీరు, ఫ్యాన్లు, కూలర్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది.

# భవిష్యత్ తరాల కోసం పర్యావరణ సంరక్షణపై బీజేపీ మేధోమథనం

**○ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నేడు రౌండ్ టేబుల్ సమావేశం**

**○ పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధిపై మేధోమథనం**

**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ):** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం విజయవాడలో నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాజ్యసభ సభ్యుడు పాక వెంకట సత్యనారాయణ, బీజేపీ శాసనమండలి పక్ష నేత సోము వీర్రాజు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.

ఈ సమావేశంలో గ్రీన్ కులాల సంఘాల ప్రతినిధులు, సామాజిక వర్గాల ప్రతినిధులు, నిపుణులు పాల్గొని పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల సంరక్షణ, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై తమ అభిప్రాయాలను వెల్లడించనున్నారు.

పర్యావరణహిత విధానాల రూపకల్పనకు అవసరమైన సూచనలు స్వీకరించడం, ప్రజల్లో పర్యావరణంపై అవగాహన పెంచడం, సామాజిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.

"సుస్థిర అభివృద్ధి – పర్యావరణ పరిరక్షణతోనే సాధ్యం" అనే లక్ష్యంతో భవిష్యత్ కార్యాచరణకు మార్గదర్శకాలను రూపొందించేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలి

**○ ఎస్సీ,ఎస్టీ లకు పదోన్నతులలో జరుగుతున్న లోపాలను సరిచేయాలి**

**○ కాంట్రాక్టు,అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలి**

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలలో ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి జిల్లాల కలెక్టరేట్లలో నెలకు ఒకసారి ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు అసోసియేషన్ ఆధ్వర్యంలో కాల్ విత్ యువర్ లీడర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు కు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి ఉద్యోగులు ఫోన్ చేసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ పలు ప్రభుత్వ కార్యాలయాలలో ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతులలో అన్యాయం,వార్షిక ఇంక్రిమెంట్ల మంజూరులో తీవ్ర జాప్యం తదితర అంశాలు అసోసియేషన్ దృష్టికి వచ్చాయని తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలులో ఉన్నతాధికారులకు సరైన అవగాహన లేకపోవడం,ఉద్దేశ పూర్వక జాప్యం తదితర కారణాలతో పదోన్నతులలో పలువురు ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. వివిధ ప్రభుత్వ శాఖలలో ఇరవై సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న కాంట్రాక్టు,, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతన చెల్లింపు విధానం అమలు కాకపోవడం వల్ల అతి తక్కువ జీతాలతో వాళ్ళు తీవ్రకష్టాలు అనుభవిస్తున్నారన్నారు. ఇచ్చే తక్కువ వేతనాలకు కూడా రెండు మూడు నెలలు ఎదురు చూడాల్సి రావటం బాధాకరమన్నారు.

కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని సురేష్ బాబు తెలిపారు. ప్రతి నెలకు ఒక రోజు అసోసియేషన్ ఆధ్వర్యంలో కాల్ విత్ యువర్ లీడర్ కార్యక్రమాన్ని నిర్వహించి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తామన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467